సత్యం, సమర్థత, విశ్వసనీయత

WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి: 17 | సంచిక: 163
పేజీలు: 08 | వెల: రూ.2:00

హైదరాబాద్ | బుధవారం 10 జూన్ 2026

Published from Hyderabad, Vijayawada.

## కాంగ్రెస్‌కు ఊహించని షాక్

- మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ
- అఫిడవిట్‌లో వివరాలు దాచారని తిరస్కరణ
- న్యాయపోరాటం చేస్తామన్న సీఎం రేవంత్



భోపాల్,జూన్9(సాక్ష్యం): కాంగ్రెస్ పార్టీకి అనుకోని ఘటన ఎదురయ్యింది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి ఆమె రాజ్యసభ ఎన్నికల కోసం నామినేషన్ వేయగా.. అది తిరస్కరణకు గురైంది. నామినేషన్ పత్రాలతో సమర్పించిన అఫిడవిట్‌లో ఒక పెండింగ్ కేసుకు సంబంధించిన వివరాలను పూర్తిగా వెల్లడించలేదనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. నామినేషన్ల పరిశీలన సమయంలో బీజేపీ నాయకులు రిటర్నింగ్ అధికారికి

మిగతా 5 లో..



## ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా

- నిరూపిస్తే వెంటనే రాజీనామా చేస్తా
- సీఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్

న్యూఢిల్లీ,జూన్9(సాక్ష్యం): తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు.

మిగతా 2 లో..



## ఆస్తులు వందకోట్లకు పైనే..

- ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్ ఇంట్లో సోదాలు
- భారీగా బంగారం, నగదు, ఆస్తులు గుర్తించిన ఏసీబీ
- కిలో బంగారం, 60 లక్షల నగదు స్వాధీనం

హైదరాబాద్,జూన్9(సాక్ష్యం): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో రోడ్లు

మిగతా 2 లో..



## మహిళలను మభ్య పెడుతున్న సీఎం

- ముందు అంగన్‌వాడీలకు జీతాలు చెల్లించండి
- ఎక్స్ వేదికగా హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,జూన్9(సాక్ష్యం): అంగన్‌వాడీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాలు చెల్లించడం లేదంటూ బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని

మిగతా 2 లో..



# నెత్తురోడిన పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్

### అవామీ యాక్షన్ కమిటీపై నిరసనలు.. అల్లర్లలో 30 మందికిపైగా మృతి!

కశ్మీర్, జూన్9(సాక్ష్యం): పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ మరోసారి నెత్తురోడింది. స్థానిక అవామీ యాక్షన్ కమిటీ-కమిటీపై నిషేధానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్న పౌరులపై పాక్ సైన్యం మంగళవారం కాల్పులు జరిపింది. దీనితో అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లలో పలువురు భద్రతాసిబ్బంది సహా మొత్తం 30 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, 200 మంది వరకు గాయాలపాలు అయ్యారని పాక్ ప్రభుత్వం తెలిపింది. అయితే మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని, పాక్ ప్రభుత్వం కావాలనే వివరాలను బయటకు రానివ్వడం లేదని కమిటీతో పాటు స్థానికులు ఆరోపిస్తున్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ లో పౌర సమాజ కూటమిగా ఏర్పడ్డ పీవోకేలో ఆర్థిక, రాజకీయాలకు సంబంధించిన విషయాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తోంది. ముఖ్యంగా పీవోకేలో ఇంతకు ముందు జరిగిన హింసాత్మక ఘటనలు, ఇంటర్నెట్ నిలిపివేత, విద్యుత్ కొరత, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, వనరుల దోపిడీ, రాజకీయ వివక్ష మొదలైన సమస్యలపై పోరాడుతోంది. ఈ క్రమంలోనే, జులై 27న పాక్ ఆక్రమిత కశ్మీర్ శాసనసభకు ఎన్నికలు నిర్వహించాలని పాక్ నిర్ణయించింది. అయితే ఈ శాసనసభలో ఉన్న మొత్తం 45 స్థానాల్లో 12 స్థానాలను పీవోకేకు చెందని పాక్ జాతీయులకు కేటాయిస్తూ (రిజర్వేషన్) చట్టం చేసింది.

మిగతా 2 లో..

# ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు

- మహిళా సాధికారతకు మరో అడుగు
- మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ
- ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట
- వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు
- మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది
- వారి దెబ్బకే కొందరు ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు
- కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు
- బీజేపీ కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు
- పరేడ్ గ్రౌండ్స్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మహిళలు ఎదుగుతుంటే ఓర్వలేని బిఆర్ఎస్
- ఫ్రీ బస్సు తీసుకొస్తే కళ్లల్లో నిప్పులు పోసుకున్నారు
- పరేడ్ గ్రౌండ్స్ సభలో మంత్రి సీతక్క ఘాటు విమర్శలు

**"2034 వరకు మీ ఆశీర్వాదంతో ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తాం. వెయ్యి కాదు 3 వేల ఆర్టీసీ బస్సులు తీసుకొస్తాం. ఇందిరమ్మ ఇల్లు ఆడబిడ్డల పేరు మీదే ఇచ్చాం. పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి మహిళల పేరుమీదే ఇస్తాం. మీకు ఎవరు అడ్డం వచ్చినా ఆర్టీసీ బస్సుతో తొక్కించండి. మహిళలను అభివృద్ధిలో సగం వ్యాపారంలో సగం చేశాం. రిలయన్స్‌తో పోటీ పడి పెట్రోల్ బంక్‌లను మా ఆడబిడ్డలు నడిపిస్తున్నారు. అంబానీ, అదానీతో పోటీ పడి మా ఆడబిడ్డలు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. కోటి మంది అడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని ఈ ప్రభుత్వం కంకణం కట్టుకుంది" రేవంత్ రెడ్డి, సీఎం**




హైదరాబాద్,జూన్9(సాక్ష్యం): మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని ప్రస్తావించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డలతో పెట్టుకుంటే అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. తమ అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో పండుకున్నారని విమర్శించారు. ఉచిత బస్సుతో స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపౌట్స్ తగ్గాయని

మిగతా 2 లో..

## ఉద్యోగుల జీతాల చెల్లింపులో జాప్యం

### అధికారుల తీరుపై మండిపడ్డ సీఎం

హైదరాబాద్,జూన్9(సాక్ష్యం): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపులో జాప్యంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాల ఆలస్యానికి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. సీఎం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపుపై ఆర్థిక శాఖ కీలక సర్క్యులర్ జారీ చేసింది. రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, హానరేరియం ఉద్యోగులందరికీ 1వ తేదీన వేతనాలు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆలస్యమైతే హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్, డీడీఓలదే బాధ్యతని తెలిపారు. ప్రతి నెల 25వ తేదీలోపు జీతాల బిల్లులు ట్రెజరీకి సమర్పించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలాఖరులోపు బిల్లుల స్క్రూటినీ,

మిగతా 2 లో..



## కాంగోను వణికిస్తున్న ఎబోలా

### ఇప్పటికే 101 మంది మృత్యువాత

న్యూఢిల్లీ,జూన్9(సాక్ష్యం): మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ఈ వైరస్ కారణంగా ఇక్కడ ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం ఆందోళనను రేకెత్తిస్తోంది. ఈ మేరకు కాంగో ఆరోగ్య అధికారులు ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆ ప్రకటన ప్రకారం.. కాంగోలో ఇప్పటివరకు 550కి పైగా

మిగతా 2 లో..

## పెరుగుతున్న ధరలతో మధ్యతరగతి అధోగతి

- ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి
- 14 రకాల నిత్యావసరాలు అందచేయాలి
- సివిల్ సప్లై కార్యాలయం ఎదుట ఐద్వా ధర్నా

హైదరాబాద్,జూన్9(సాక్ష్యం): పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయం ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్లు లక్ష్మి

# కొనలేవక కొర్రీలు

- ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు
- మరోమారు కేంద్రానికి లేఖ రాస్తా..
- 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు
- హమాలీల కొరత కూడా సేకరణలో అడ్డంకి
- ధాన్యం సేకరణలో ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాధ్యతారహి విమర్శలు
- మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయన్న ఎన్‌డీఎస్‌ఏ
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,జూన్9(సాక్ష్యం): తెలంగాణ రాష్ట్రంలోని వడ్లకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ లేదని పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందుకే ఈ వడ్లను కేంద్రం కొనుగోలు చేయడానికి సుముఖంగా లేదన్నారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పండించిన 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు

మిగతా 5 లో..



## నైరుతి ఆగమనంతో పలకరించిన తొలకరి

- హైదరాబాద్ నగరంలో ఉరుములతో భారీ వర్షం
- ఎప్పటిలాగే లోతట్టు ప్రాంతాలు జలమయం
- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్,జూన్9(సాక్ష్యం): తొలకరి పలకరించింది. నైరుతి ప్రవేశంతో హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరంలో పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల తీవ్రతకు

మిగతా 5 లో..

### భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగానే

# అడుగులు..

- స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామికవృద్ధికి ప్రాధాన్యం
- పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రధానోత్సవం



హైదరాబాద్,జూన్9(సాక్ష్యం): భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్

మిగతా 5 లో..

# సంపాదకీయం

## ట్రంప్‌కు వీసా దెబ్బ !

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మహాశయుడికి ఎదురుగాలి వీస్తోంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఇరాన్‌పై యుద్ధం చేయడాన్ని అమెరికా పౌరులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ఇక ప్రపంచమంతా కూడా ట్రంప్ యుద్ధ పిపాసపై మండిపడుతోంది. అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో పడ్డాయి. ఇంధనం దొరక్క అనేక దేశాలు అల్లాడి పోతున్నాయి. ఈ తరుణంలో ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలకు ట్రంప్ సర్కార్ విధించిన లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమంటూ అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుతో అనేక కంపెనీలకు ఊరట లభించినట్లయ్యింది. దీనిపై ప్రవాస భారతీయ సంఘాలు, డెమోక్రాట్లతో పాటు ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్ నేతలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ పరిణామాలు వీసాల జారీపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయన్న చర్చ జరుగుతోంది. అలాగే ఈ తీర్పుతో భారతీయులకు ప్రయోజనం ఎంతన్నది కూడా చర్చిస్తున్నారు. అమెరికా హెచ్-1బీ అనేది.. నాన్ ఇమిగ్రెంట్ వీసా. ప్రధానంగా ప్రత్యేక వృత్తుల్లో సాంకేతిక నైపుణ్యమున్న విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకోవటానికి యూఎస్ కంపెనీలను ఇది అనుమతిస్తుంది. అగ్రరాజ్యం ఏటా 65వేల మందికి ఈ వీసాలను జారీ చేస్తుంది. దీంతోపాటు అక్కడే మాస్టర్స్ చేసిన మరో 20వేల మందికి ఇవ్వాలనే నిబంధన ఉంది. అంటే మొత్తంగా ఏటా 85వేల హెచ్-1బీ వీసాలు జారీ అవుతుంటాయి. ఈ వీసాలు పొందినవారిలో దాదాపు 70శాతం మంది భారతీయులే ఉంటున్నారు. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉంది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసారు. విదేశీ ఉద్యోగులపై ఆధారపడకుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెను ప్రభావమే పడింది. ఈ స్థాయిలో ఫీజును భరించలేక చాలా కంపెనీలు హెచ్-1బీ నియామకాలను తగ్గించాయి. ఈ ఫీజును సవాల్ చేస్తూ పలు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే హెచ్-1బీ వీసా ఫీజులపై విచారణ జరిపిన బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు.. అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలపనందున దానిని చట్టవిరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ ఫీజు చెల్లబోదంటూ కీలక తీర్పు వెలువరించింది. దీంతో అమెరికా కంపెనీలపై తక్షణ ఆర్థికభారం తగ్గినట్లయ్యింది. అయితే, తీర్పు నేపథ్యంలో ఈ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తారా? అంటే కాదనే సమాధానమే వినిపిస్తోంది. బోస్టన్ కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేస్తామని వైట్‌హౌస్ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. అదే జరిగితే.. మరికొన్ని నెలల పాటు ఈ అంశం న్యాయస్థానాల్లో మగ్గనుంది. గతంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును ట్రంప్ సర్కారు అప్పీల్ చేసి గెలిచిన సందర్భాలూ ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్టే..! ఈ తీర్పు వల్ల ఏటా ఇచ్చే హెచ్-1బీ కోటాలో ఎలాంటి మార్పు ఉండదు. వీసా వస్తుందన్న గ్యారెంటీ కూడా లేదు. కాకపోతే.. ప్రస్తుతానికి ఫీజు భారం తగ్గడంతో ఈ అవకాశాన్ని అమెరికా కంపెనీలు సద్వినియోగం చేసుకునే వీలుంది. ఇప్పటికే వృత్తి నిపుణుల కొరతతో సతమతమవుతున్న కంపెనీలు.. మళ్లీ విదేశీ ఉద్యోగుల నియామకాలు పెంచుకునే వీలుంది. సాధారణంగా వీరిలో అత్యధిక అవకాశాలు భారతీయులకే దక్కుతాయి కాబట్టి.. మనవాళ్లకు కొంతమేర ఉపశమనం లభించినట్లేనని వృత్తి నిపుణులు భావిస్తున్నారు. అయితే అనేక వివాదాస్పద నిర్ణయాలతో ట్రంప్ ప్రజలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఈ వీసా నిబంధనల కారణంగా అమెరికాకు వచ్చే వృత్తి నిపుణులకు కొరత ఏర్పడింది. ఈ క్రమంలో హెచ్-1బీ వీసా ఫీజుపై ట్రంప్ నిర్ణయాన్ని కొట్టివేస్తూ.. ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అమెరికా లోని ప్రవాస భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్ కి చెందిన చీఫ్ స్పందించారు. హెచ్-1బీ వీసా రుసుముపై ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ ఆధారిత వలసల వ్యవస్థపై స్థిరత్వాన్ని ఇది తిరిగి తీసుకొస్తుందన్నారు. అమెరికాలో సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ, అధునాతన తయారీ రంగాల వృద్ధికి ప్రపంచంలోని ప్రతిభావంతులు అవసరమని ఇక్కడి నిపుణులు అభిప్రయాపడ్డారు. విధానపరమైన మార్పులు, చట్టబద్ధమైన అధికారం, ఆర్థిక గణాంకాలపై ఆధారపడి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇండియాస్పోరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషిపురా కోర్టు తీర్పుపై హర్షాతిరేకాలు తెలియజేశారు. అయితే, ట్రంప్ యంత్రాంగం ఈ విషయాన్ని ఇంతటితో ముగుస్తుందా.. లేదా అనే దానిపై అనుమానం వ్యక్తంచేశారు. ట్రంప్ యంత్రాంగానికి, న్యాయవ్యవస్థలకు మధ్య ఇటీవల జరిగిన పలు వివాదాలను ప్రస్తావించారు. చట్టానికి విరుద్ధంగా.. విధానపరమైన అంశాలతో అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసాదారుల కు మరిన్ని అడ్డంకులు సృష్టించవచ్చని హెచ్చరించారు. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం సంచలనం సృష్టించింది. ట్రంప్ నిర్ణయాన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈక్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై ట్రంప్ యంత్రాంగం అప్పీల్ చేయనున్నట్లు తెలుస్తోంది.

## ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా

మొదటిపేజీ తరువాయి..

మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ ప్రజల బతుకులు మాత్రం మారలేదంటూ కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారంటూ గత బీఆర్ఎస్, ప్రస్తుత రేవంత్ సర్కార్ తీరును ఆయన ఎండగట్టారు. హైదరాబాద్‌లో భూములు మిగిలే పరిస్థితి లేదన్నారు. మంత్రులతోపాటు అందరూ భూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని చెప్పారు. ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.



సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. పదవులు, అధికారం కోసం మాటలు మార్చే వ్యక్తిని తాను కానని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మీరిచ్చిన ఏ గ్యారంటీ అయినా అమలు చేశారా? అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని వ్యంగ్యంగా అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం, ప్రజలను వంచించడంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గమనించాలంటూ తెలంగాణ సమాజానికి ఈ సందర్భంగా సూచించారు. సీఎం రేవంత్‌కు తాము గులాంలు కామన్నారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు

మొదటిపేజీ తరువాయి..

అన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకుని ఉచిత బస్సు పథకం ఆపాలని కొంతమంది చూశారని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి పంపారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. 27 వేల స్కూళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఆడబిడ్డలకు అప్పగించామని తెలిపారు. మిడ్ డే మీల్ పథకం సరుకులు కూడా మహిళలే సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పెట్రోల్ బంకుల నిర్వహణ అప్పగించడంతో లక్షలు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. 8 వేల స్త్రీ శక్తి భవనాలు ఒకేసారి పూర్తిచేస్తామని అన్నారు. కార్పొరేట్ ఆఫీస్‌ల కంటే మిన్నగా స్త్రీ శక్తి భవనాలు ఉంటాయని వివరించారు. హైటెక్ సిటీ దగ్గర మహిళలకు రూ.1000 కోట్ల



భూమి కేటాయించామని ప్రస్తావించారు. 106 స్టాల్స్‌తో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో మాల్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దళారులు, దోపిడీదారులకు తమ ప్రభుత్వంలో చోటులేదని స్పష్టం చేశారు. 2034 వరకు ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అండగా ఉండే బాధ్యత తమదని తెలిపారు. ఎవరెన్నీ కుట్రలు చేసినా మహిళా సంఘాలను ఆదుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రూ.60 వేల కోట్ల రుణాలతో ఆర్థికంగా నిలబెడుతున్నామని తెలిపారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని మంచి చీరలు ఇస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన చీరలను ఎవరైనా కట్టుకున్నారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల సంక్షేమానికి అన్నివేళలా కృషిచేస్తామని తెలిపారు. పంట మార్పిడి విషయంలో మహిళలు చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

మన సంస్కృతి, సంప్రదాయల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుంది. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును గత ప్రభుత్వం చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం' అన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారు. వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలు. ఆడబిడ్డ పుడితే.. మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనది. మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుంది. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది. భారత్‌కు స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుందని రేవంత్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారు. సోనియా గాంధీ 2013లో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు ప్రవేశపెట్టారు.

అంబానీ, ఆదానీలకు పోటీగా పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని కాంగ్రెస్ సర్కార్ కోరుకుంటే బీఆర్ఎస్ ఏడుస్తోందని మంత్రి సీతక్క విమర్శించారు. మహిళలు ఎదిగితే బీఆర్ఎస్ ఓర్వలేకపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల కోసం ఫ్రీ బస్ స్కీమ్ తీసుకొస్తే కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని బీఆర్ఎస్ పై ఫైర్ అయ్యారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ ప్రభుత్వం మహిళా శక్తి సభ నిర్వహించింది. మంత్రి సీతక్క ఈ సభకు హాజరై ప్రసగించారు. రాష్ట్రంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రూ.61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని తెలిపారు. రూ.2 వేల కోట్ల వడ్డీ డబ్బులను ప్రభుత్వమే చెల్లింస్తుదని చెప్పారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. మూడు వేలకు పైగా మహిళా సంఘాలకు ఐకేపీ సెంటర్లు ఇచ్చామని.. వీటి ద్వారా ఆడబిడ్డలకు గతేడాది రూ.159 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో చదువుకోని 12 లక్షల మంది మహిళలకు చదువు చెప్పిస్తున్నామన్నారు. 60 ఏళ్లు దాటిన మహిళలను కూడా మహిళా సంఘాల్లో చేర్చుతున్నామని తెలిపారు. గ్రామీణ మహిళలు స్వయంగా తయారు చేసే ఉత్పత్తులను ప్రపంచానికి చూపిస్తున్నామని అన్నారు.

## ఉద్యోగుల జీతాల చెల్లింపులో జాప్యం

మొదటిపేజీ తరువాయి..

ఆడిట్, అథరైజేషన్ పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి హుకుం జారీ చేశారు. బ్జడెట్ కొరత లేదా సాంకేతిక సమస్యలు ఉంటే ముందుగానే ∩÷నాన్స్ శాఖకు తెలియజేయాలని సూచించారు. జీతాల చెల్లింపులో పరిపాలనా నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. అన్నిశాఖలు, కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, సొసైటీలు ఉత్తర్వులు ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగికి ప్రతి నెల 1వ తేదీన జీతం చేరేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ మేరకు ∩÷నాన్స్ శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్‌కు సమన్వయ బాధ్యతలను సీఎం రేవంత్‌రెడ్డి అప్పగించారు.



# నెత్తురోడిన పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్

మొదటిపేజీ తరువాయి..

దీని వల్ల స్థానికుల హక్కులు దెబ్బతింటాయంటూ ఉద్యమిస్తోంది. ఈ క్రమంలో ఆ సంస్థకు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని పాక్ ఆరోపించింది. అక్కడితో ఆగకుండా ప్రజాశాంతి, భద్రతకు ముప్పు ఉందనే కారణం చూపిస్తూ గతవారం జేఏఏసీ సంస్థను నిషేధించింది. దీనిని వ్యతిరేకిస్తూ స్థానికులు రోడ్లపైకి రావడంతో అల్లర్లు చెలరేగాయి. ఈ క్రమంలో గత శుక్రవారం రాత్రి సైన్యం జరిపిన కాల్పుల్లో ఒక వ్యాపారి మరణించాడు. దీనితో పీవోకేలో ఒక్కసారిగా ఉద్రిక్తతలు పెరిగాయి. ఆదివారం రావల్‌కోట్ నగరంలో సైన్యానికి, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. దీనిపై రావల్‌కోట్ కమిషనర్ సర్దార్



వహీద్ ఖాన్ ఓ ప్రముఖ న్యూస్ ఏజెన్సీతో మాట్లాడుతూ, "పోలీసుల కాల్పుల్లో మరణించిన వ్యాపారి మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీలో ఉంచాం. దీనిలో ఆ ఆసుపత్రి వెలుపల జేఏఏసీ మద్దతుదారులు భారీగా గుమిగూడారు. భద్రతా దళాలు వారిని చెదరగొట్టడానికి చూశాయి. దీనితో జేఏఏసీకు చెందిన కార్యకర్తలు ఆటోమేటిక్ రైఫిళ్లు, పెట్రోల్ బాంబులు, ఇతర ఆయుధాలతో దాడులకు దిగారు. దీనిని అడ్డుకోవడానికి భద్రతా దళాలు కాల్పులు జరపడంతో ఆరుగురు నిరసనకారులు మరణించారు. ఆ తర్వాత పలువురిని అరెస్టు చేశారు" అని తెలిపారు.అయితే కమిషనర్ సర్దార్ వహీద్ ఖాన్ ప్రకటనను స్థానికులు, జేఏఏసీ మద్దతుదారులు ఖండించారు. పౌరుల మరణాల సంఖ్య ప్రభుత్వం చెబుతున్నదానికంటే చాలా ఎక్కువగా ఉంటుందని వారు అంటున్నారు. తమను ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చడంపై మండిపడుతున్నారు. దీనిని వారు 'అణిచివేత చర్య'గా అభివర్ణిస్తున్నారు. తాము కేవలం చట్టబద్ధమైన రాజకీయ, ఆర్థిక హక్కుల కోసమే నిరసన తెలుపుతున్నామని చెబుతున్నారు. అయితే ఇటీవలి కాలంలో ఈ సంస్థ పలు హింసాత్మక నిరసనలను చేపట్టడం గమనార్హం.కాగా, ఉగ్రవాద నిరోధక చట్టం కింద జేఏఏసీని నిషేధించడంపై పాకిస్థాన్ మానవ హక్కుల సంఘం (హెచ్ఆర్‌సీపీ) ఆందోళన వ్యక్తం చేసింది. భద్రతా దళాలు నిరసనకారులపై మితిమీరి బలప్రయోగం చేసిందని విమర్శించింది. వారిపై కాల్పులు జరపడాన్ని ఖండించింది. మరోవైపు పీవోకేలో జరిగిన అల్లర్లలో పౌరులు, భద్రతాధికారులు మరణించడంపై ఆవేదన వ్యక్తం చేసింది. కమ్యునికేషన్ బ్లాకౌట్స్ (ఇంటర్నెట్, ఫోన్ సేవలు నిలిపివేయడం)పై నిరసన వ్యక్తం చేసింది. మరోవైపు క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయడానికి వీలైనంత త్వరగా ఒక వాస్తవ నిర్ధరణ కమిటీని పంపించనున్నట్లు హెచ్ఆర్‌సీపీ ప్రకటించింది.

## కాంగోను వణికిస్తున్న ఎబోలా

మొదటిపేజీ తరువాయి..

ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. వారిలో 101 మంది ప్రాణాలు కోల్పోగా.. 19 మంది కోలుకున్నారు. మరో 309 మంది ఎబోలా అనుమానితులు ఐసోలేషన్‌లో ఉన్నారు. ఆదివారం ఒక్కరోజే ఇటురి, నార్త్ కివులలో 35 కొత్త కేసులు నమోదవగా, మరో 10 మంది మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం వైరస్ తీవ్రత పెరుగుతోందని, కొన్నిరోజుల తర్వాత తీవ్రత తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. వ్యాధి నిర్ధరణ.. వైరస్‌కు సరైన టీకా, చికిత్స లేకపోవడం సవాళ్లుగా మారాయని తెలిపారు. కేసుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండొచ్చని భావిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (చఉఃక్ష) హెచ్చరికలు జారీ చేసింది. ప్రాంతీయంగా ఈ వ్యాధి మరింత వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇక, ఉగాండాలో 19 ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. కాగా.. రెండు మరణాలు చోటుచేసుకున్నాయి.



## ఆస్తులు వందకోట్లకు పైనే..

మొదటిపేజీ తరువాయి..

మరియు భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) ఈఎన్‌సీ మోహన్ నాయక్ నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన పలు ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు విస్తృత స్థాయిలో సోదాలు చేపట్టారు. హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఉదయం నుంచి తనిఖీలు కొనసాగాయి. మోహన్ నాయక్ ఈఎన్‌సీ హోదాలో ఉన్న సమయంలో వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో మొత్తం 11 చోట్ల ఏకకాలంలో దాడులు చేపట్టారు. మియాపూర్ లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న విల్లా నంబర్-98లో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. భద్రతా కారణాల దృష్ట్యా అధికారుల అనుమతి లేకుండా ఎవరినీ లోపలికి అనుమతించ లేదు. సోదాల సందర్భంగా పలు కీలక పత్రాలు, ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదు, బంగారు ఆభరణాలను అధికారులు గుర్తించినట్లు సమాచారం. ప్రాథమిక సమాచారం ప్రకారం.. రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన టెండర్ల కేటాయింపుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు మోహన్ నాయక్‌పై గతంలోనే పలు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా కాంట్రాక్టర్లకు టెండర్లు కేటాయించే ప్రక్రియలో అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుల




ఆధారంగా ఏసీబీ విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. సోదాలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి లెక్కలు, స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువపై అధికారిక వివరాలు వెల్లడించాల్సి ఉంది. సాయంత్రం వరకు ఈ తనిఖీలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సోదాలు పూర్తయిన అనంతరం కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ వెల్లడించనున్నారు. మోహన్ నాయక్ ఇంటితోపాటు 15 ప్రాంతాల్లోని ఆయన బంధువుల నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. అతడి ఇంట్లో 20కి పైగా విదేశీ మద్యం సీసాలను గుర్తించారు. మంగళవారం ఉదయం నుంచి తనిఖీలు కొనసాగుతున్నాయని, సోదాలు పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. మోహన్ నాయక్ ఇంట్లో చేపట్టిన తనిఖీల్లో రూ.60లక్షల నగదు గుర్తించినట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. కిలో బంగారు నగలు, 13 బంగారు బిస్కెట్లు గుర్తించినట్లు తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్‌లో ఇళ్ల స్థలాల పత్రాలు గుర్తించామని తెలిపారు. మరోవైపు, మోహన్ నాయక్ కార్యాలయంలోనూ ఏసీబీ సోదాలు జరిపింది. ఎర్రమంజిల్‌లోని కార్యాలయంలో పలు ఫైళ్లను తనిఖీ చేస్తున్నారు. అక్కడి అధికారుల నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నారు. అతడి ఆస్తుల విలువ రూ.100 కోట్లకు పైనే ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది.

## మహిళలను మభ్య పెడుతున్న సీఎం

మొదటిపేజీ తరువాయి..

రేవంత్ మభ్యపెడుతున్నారని ఆగ్రహించారు. అంగన్‌వాడీలకు ముందు జీతాలు చెల్లించి మహిళలపై ముఖ్యమంత్రికి ఉన్న గౌరవాన్ని నిరూపించుకోవాలన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక 62 వేల మంది అంగన్‌వాడీలు కష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. 'రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62 వేల మంది అంగన్‌వాడీ సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా?. నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుతుంది. సాటి మహిళల కన్నీటి గోసను మహిళా మంత్రిగా ఉన్న సీతక్క అర్థం చేసుకోకపోవడం శోచనీయం. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారి గౌరవాన్ని పెంచారు. వారు వర్కర్లు కాదని, టీచర్లని పేర్కొంటూ హోదాను ఉన్నతీకరించారు.



2014 నాటికి అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది. కానీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.13,650కు, మినీ అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.7,800కు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800కు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారు. అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.18వేలకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. మాయమాటలు చెప్పి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీగతీ లేదు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక అబద్దాల ప్రచారం చేస్తున్నట్లు కాంగ్రెస్ వైఖరి ఉంది. సమస్యల పరిష్కారం కోసం 'ఛలో సెక్రటేరియట్' పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించింది. అంగన్‌వాడీలపై పోలీసులను ప్రయోగించి దుర్మార్గమైన చరిత్రను కాంగ్రెస్ మూటకట్టుకుంది. ఇప్పటికైనా కళ్లు తెరవండి. మీ పాలనను అన్ని వర్గాల ప్రజలు ఛీ కొడుతున్నారన్న విషయాన్ని గుర్తించండి. పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీల వేతనాలను తక్షణమే చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అంటూ పోస్టు పెట్టారు.

## కాంగ్రెస్‌కు ఊహించని షాక్

మొదటిపేజీ తరువాయి..

అభ్యంతరం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఒక కోర్టు కేసు వివరాలను మీనాక్షి నటరాజన్ తన అఫిడవిట్‌లో పేర్కొనలేదని బీజేపీ ఆరోపించింది. ఈ అభ్యంతరాన్ని పరిశీలించిన అనంతరం నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. మీనాక్షి నటరాజన్ గతంలో లోక్‌సభ సభ్యురాలిగా పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కాంగ్రెస్ తమ ఎమ్మెల్యేలను కర్ణాటకకు తరలించి క్రాస్ ఓటింగ్‌ను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఇక, మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ నిర్ణయాన్ని కాంగ్రెస్ సవాలు చేస్తుందా? లేదా ప్రత్యామ్నాయ వ్యూహంతో ముందుకు వెళ్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇదిలావుంటే మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను మధ్యప్రదేశ్ ఎన్నికల అధికారి తిరస్కరించడంపై ఆ పార్టీ స్పందించింది. బుధవారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించడం ప్రజాస్వామ్య పక్రియను దెబ్బతీయడానికి బీజేపీ చేసిన బహిరంగ ప్రయత్నమని ఆయన అభివర్ణించారు. ఆమె నామినేషన్‌లో ఏదైనా తప్పు లేదా వివరాలను వెల్లడించలేదనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి, అవాస్తవమైనవని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన స్థానాన్ని లాక్కోవడానికి చేసిన నిరాశాజనకమైన ప్రయత్నం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకునే బీజేపీ కుట్రలు విఫలమవుతున్నాయని గ్రహించిన తర్వాత, వారు ఇంత దిగజారిపోయి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని వివరించారు. ఇది రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై బీజేపీకి ఉన్న నిబద్ధత ఎంత బూటకమో మరోసారి నిరూపిస్తోందని తెలిపారు. ప్రతి దశలోనూ బీజేపీ ఏదో ఒక రూపంలో ఓట్ల చోరీ చేయడానికే ప్రయత్నిస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలు దోచుకునే ఈ చర్యను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని కరాకండిగా చెప్పారు. దీనిపై న్యాయపరంగా, రాజకీయంగా, ప్రజల మధ్యన గట్టిగా పోరాడుతామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించడం బీజేపీ కుట్ర అని ఆరోపించారు. 'ఓట్ చోరీ', 'ఎస్ఐఆర్' తర్వాత, ఇప్పుడు బీజేపీ 'సీట్ చోరీ'కి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని స్పష్టం చేశారు. ఈమేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు పెట్టారు. జైరాం రమేశ్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకత్వం ఎన్నికల కమిషన్‌ను కలిసేందుకు వెళ్లే ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. బీజేపీ గెలవలేక కుట్ర చేసి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని ఆగ్రహించారు. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఇలా చేయడం ప్రజల గొంతులను అణచివేయడమే నని చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్యానికి ఇది ఒక చీకటి రోజు అని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని పౌరులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని? న్యాయం జరిగే వరకు పోరాడుతామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## గచ్చిబౌలిలోని హిల్ రీడ్జ్ విల్లాలో దోపిడి కేసు

### 24 గంటల్లో ఛేదించామన్న శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్

హైదరాబాద్,జూన్9(సాక్ష్యం): గచ్చిబౌలిలోని హిల్ రీడ్జ్ విల్లాలో దోపిడి కేసును 24 గంటల్లో ఛేదించామని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ దోపిడికి పాల్పడిన ఇద్దరు నేపాలీ దొంగలను ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి 7 కిలోల బంగారంతోపాటు కిలోన్నర వెండి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ దోపిడి జరిగిన వెంటనే ఫిర్యాదు అందడంతో.. ఆరు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. నిందితులకంటే ముందే భారత్, నేపాల్ సరిహద్దుల్లోకి ఆయా బృందాలు చేరుకున్నాయని వివరించారు. తద్వారా నిందితులను అరెస్ట్ చేయడం సులువైందన్నారు.

బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని న్యాయస్థానంలో నిందితులను హాజరు పరిచి అనంతరం హైదరాబాద్‌కు తీసుకోస్తామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఇంట్లో నేపాలీ పని మనుషులను పెట్టుకొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా ప్రజలకు డీసీపీ సూచించారు. హిల్ రీడ్జ్ విల్లాలో ఇంటి ఓనర్లు బయటకు వెళ్లే సమయంలో లాకర్ కీ దాచే ప్రదేశాన్ని నేపాలీ పని మనిషి దంపతులు ముందుగా గుర్తించారని తెలిపారు. ఇలా ఇంట్లో యజమానులు లేని సమయంలో ఈ దంపతులు లాకర్ ఓపెన్ చేసి బంగారం, వెండి చోరీ చేశారని వివరించారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సైబరాబాద్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టి దోపిడి దొంగలను అరెస్ట్ చేశారని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ వివరించారు.

## భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగానే అడుగులు..

మొదటిపేజీ తరువాయి..

కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఐటీ, లైఫ్ సైన్సెస్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, డీప్–టెక్ వరకు తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమ 4.0 విప్లవంలో భాగంగా దూసుకొస్తున్న ఆటోమేషన్, డీప్–టెక్ సవాళ్లను ఎదుర్కొనేలా రాష్ట్రంలో కాంప్రెహెన్సివ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదే సమయంలో... భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామిక వృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పారిశ్రామికాభివృద్ధి అనేది కేవలం భూమి, మూలధనంపైనే కాకుండా... మేధో సంపత్తి, నాలెడ్జ్ ఎకానమీ ఆధారంగానే సాధ్యమవుతుందన్నారు. అందుకు... పరిశ్రమల అవసరాలకు, విద్యాసంస్థల శిక్షణకు మధ్య ఉన్న స్కిల్ గ్యాప్ ను పూడ్చాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను స్కిల్ క్యాపిటల్ గా మార్చాలనే సంకల్పంతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను తీసుకొచ్చి... ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతోనే ముందుకెళ్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధిని కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలను మరింత ప్రోత్సహించేందుకు దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక 'ఎంఎస్ఎంఈ పాలసీ'ని తీసుకొచ్చామన్నారు. పారిశ్రామికవేత్తలకు 2017 నుంచి చెల్లించాల్సిన పెండింగ్ సబ్సిడీలను దశలవారీగా చెల్లిస్తున్నామన్నారు. అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకునే కనీస వేతనాలను నిర్ణయించామన్నారు. పారిశ్రామికవేత్తలను మేం కేవలం పెట్టుబడిదారులుగా మాత్రమే చూడటం లేదని... రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములుగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి పారిశ్రామికవేత్తలిచ్చే సలహాలు, సూచనలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ టీసీసీఐ ప్రతినిధులు రవి కుమార్, కేకే మహేశ్వరీ, శ్రీనివాస్ గరిమెల్లా, భాస్కర్ రెడ్డి, అనిల్ అగర్వాల్ పాల్గొన్నారు.






## కొనలేవక కొర్రీలు

మొదటిపేజీ తరువాయి..

చేయాలని మరోసారి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ప్రోక్యూర్‌మెంట్ వచ్చే అవకాశం ఉందన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఇంకా పంట సాగవుతుందని చెప్పారు. ప్రతిపక్షాలు చెప్పేవన్నీ ఆబద్దాలేనని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ కార్యాలయం నుంచి నేరుగా ఆన్‌లైన్‌లో రైతులు, మహిళా సంఘాల అకౌంట్‌లో నగదు వేస్తున్నామని చెప్పారు. మహిళ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల నుంచి రూ.170 కోట్లు చెల్లించామని వివరించారు. 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్న కూడా కొనుగోలు చేశామని తెలిపారు. క్వింటాకు రూ.1000 నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత బాధ్యతగా కొనుగోలు చేయలేదని చెప్పారు. భవిషత్తులో పాడి ప్రోక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలని దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో హమాలీల సమస్య అధికంగా ఉందన్నారు.

తెలంగాణలో ప్రస్తుతం ఉన్న స్టోరేజ్ సరిపోవడం లేదన్నారు. బుధవారం మేడిగడ్డలో మూడు బ్యారేజీల టెస్టింగ్ పక్రియపై సమీక్ష చేస్తామని చెప్పారు. ఈ మూడు బ్యారేజిల్లో నీళ్లు నింపొద్దని ఇప్పటికే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎస్ఏ చెప్పిందని గుర్తు చేశారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసిందన్నారు. దేశంలోనే రికార్డ్ స్థాయిలో తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెంగాణలో ఎక్కువ ధాన్యం ఉత్పత్తి అయ్యిందని.. యాసంగిలో రికార్డ్ స్థాయిలో ధాన్యం కొన్నామని చెప్పారు. రబీ, ఖరీఫ్ సీజన్ కలిపి 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని.. ఇన్ని టన్నుల ధాన్యం సేకరణ దేశంలోనే రికార్డ్ అని తెలిపారు. వడ్ల కొనుగోళ్లకు సంబంధించి రూ.35,077 కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని.. రైతులకు ఇబ్బంది లేకుండా స్థానికంగా ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ టార్గెట్ పెట్టిందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 75 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించిందని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రం ఏపీలో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు మాత్రమే జరిగిందని పేర్కొన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే వరిలో 61 శాతం తెలంగాణలోనే అవుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించామని.. రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చామన్నారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ ధాన్యం కొనుగోలుపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని దుష్ప్రచారం చేస్తున్నాయని ఫైర్ అయ్యారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీరుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనూ.. తెలంగాణలో సేకరించినంతా ధాన్యం సేకరించలేదని తెలిపారు. అలాంటి బీజేపీ నేతలు ఇక్కడ యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రతిపక్షాలు చెప్పేవి అన్ని అబద్దాలేనని మండిపడ్డారు. ధాన్యం విషయంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని పదిసార్లు కలిశామని తెలిపారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని కోరామని.. కానీ కేంద్రం ఎందుకు కొనుగోలు చేయట్లేదని ప్రశ్నించారు. రైతులపై బీజేపీ వైఖరి స్పష్టం అవుతోందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా బాధ్యతగా ధాన్యం కొనుగోలు చేయలేదని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. భవిషత్తులో పాడి ప్రోక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలనే అంశంపై.. దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో హమాలీల సమస్య ఎక్కువగా ఉందని ప్రస్తావించారు. మోస్ట్ అడ్వాన్స్ మోడరైజేషన్ సిస్టం తేవాలని తాము నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తెలంగాణలో ఇప్పుడు ఉన్న స్టోరేజ్ సరిపోవట్లేదని తెలిపారు.

## పెరుగుతున్న ధరలతో మధ్యతరగతి అధోగతి

మొదటిపేజీ తరువాయి..

మాట్లాడుతూ, 2014 ఎన్నికల సమయంలో బీజేపీ అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ధరల పెరుగుదలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు, పాఠశాల ఫీజులు నిరంతరం పెరుగుతున్నాయని, దీంతో సామాన్య ప్రజల జీవనం మరింత భారంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల కారణంగా కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1 కోటి 5 లక్షల 42 వేల 188 బీపీఎల్ రేషన్ కార్డులు ఉన్నాయని, వాటి పరిధిలో 3 కోట్ల 39 లక్షల 96 వేల 239 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి వ్యక్తికి ఆరు కిలోల బియ్యం మాత్రమే అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆహార భద్రతను బలోపేతం చేయాలంటే బియ్యంతో పాటు పప్పులు, వంటనూనెలు, మొక్కజొన్నలు, చక్కెర, కారం, పసుపు, జీలకర్ర, పామాయిల్, కొబ్బరి నూనె, ఆవాలు, జొన్నలు, పల్లీలు, సబ్బులు వంటి మొత్తం 14 రకాల నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల అనేక కుటుంబాలు పోషకాహారాన్ని తీసుకోలేకపోతున్నాయని, ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత సమస్య అధికమవుతోందని మల్లు లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. సరైన పోషకాహారం అందక చిన్నారులు కూడా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆహార భద్రతా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేసేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈ ధర్నా కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఆశలత, కె. నాగలక్ష్మి, పి. శశికళ, వై. వరలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బట్టుపల్లి అనూరాధతో పాటు మహిళా నాయకులు పాల్గొన్నారు.

## నైరుతి ఆగమనంతో పలకరించిన తొలకరి

మొదటిపేజీ తరువాయి..

రామ్‌నగర్‌లోని వీఎస్టీ రోడ్డులో భారీ వృక్షం నేలకొరిగింది. అలాగే, హైదర్‌గూడలోనూ ఓ భారీ వృక్షం నేలకొరగడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. పలుచోట్ల రహదారులపై వర్షం నీరు చేరింది. ముషీరాబాద్‌లో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. భాగ్యనగరంలో భారీ వర్షం కురుస్తోండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సిటీలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా లోతట్టు కాలనీలు, ప్రధాన రహదారులు, కూడళ్లలో నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, టోలీచౌకి, ఫిలింనగర్, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. పలు ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా సాగుతుండగా, కొన్ని చోట్ల ట్రాఫిక్ జాం అయింది. కార్యాలయాలు, విద్యాసంస్థల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రజలు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అధికారులు మరికొన్ని గంటల పాటు నగరంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, చెట్లు, నీటితో నిండిన ప్రాంతాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వర్షాల ప్రభావంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలంగాణలో బుధవారం కూడా పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నేడు అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 40 నుంచి 50కి.మీ వేగంతో ఈదురుగాలులతో వర్షాలు పడొచ్చని పేర్కొంది. మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు తెలిపిన వాతావరణ శాఖ అధికారులు.. కామారెడ్డిలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తున్నాం

- ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని బీఆర్ఎస్ ఆలోచించలేదు
- ఇచ్చిన హామీ మేరకు 76వేల ప్రభుత్వ ఉద్యోగాల కల్పన
- తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొంటున్న ఘనత మాదే
- జనగామ జిల్లా పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

జనగామ,జూన్ 9(సాక్ష్యం): ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర మంత్రివర్గం 18 గంటలు పనిచేస్తుంటే.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఏదో ఒక అభాండం వేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే అంతా ఖాళీ చేసిపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని దోపిడీ చేశారన్నారు. పేదలకు చెందాల్సిన సొమ్మును బీఆర్ఎస్ దోచుకుందని ఆరోపించారు. మంగళవారం నాడు జిల్లాలోని చిల్పూర్ మండలం పల్లగుట్టలో పర్యటించిన భట్టి.. 33/11కెవి సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమం ఆపడం లేదని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం వడ్లను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. కార్పోరేట్ శక్తుల దయాదక్షిణ్యాల కోసం రైతులు ఎదురు చూసేలా కేంద్రం చేస్తోందని విమర్శించారు. ఏ రాష్ట్రంలోనూ వడ్ల కొనుగోళ్లు జరగడం లేదన్నారు. తాము మొక్కజొన్నలు కూడా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఉచిత విద్యుత్ ఇచ్చింది కానీ డిస్కమ్‌లకు డబ్బులు చెల్లించలేదన్నారు. కానీ ఇప్పుడు డిస్కమ్‌లకు డబ్బులు చెల్లిస్తున్నామని అన్నారు. ఎన్నికల సందర్భంగా నేను, సీఎం ఇక్కడి ప్రజలకు హామీలు ఇచ్చాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం' అని భట్టి తెలిపారు. దేవాదుల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని వ్యాఖ్యానించారు. దేవాదుల ప్రాజెక్టు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు.. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటున్నామన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఒకప్పుడు వలసల ప్రాంతమని.. కానీ ఇప్పుడు అభివృద్ధి జరుగుతోందన్నారు. రఘునాథపల్లిలో 230ఐ÷ఎ సబ్ స్టేషన్ ఏర్పాటును పరిశీలిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తడిచిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. 72 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రూ.14వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం ఎందుకు కొనుగోలు చేయట్లేదు? రాష్ట్రం సేకరించిన మొక్కజొన్నను కూడా కేంద్రం కొనుగోలు చేయాలి. 30 లక్షల పంపుసెట్ల విద్యుత్తు బిల్లులు రూ.14వేల కోట్లు డిస్కమ్‌లకు చెల్లిస్తున్నాం. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు రూ.5వేల కోట్లు చెల్లిస్తున్నాం. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలుచేస్తున్నాం. దేవాదుల ప్రాజెక్టును గత ప్రభుత్వం గాలికొదిలేసింది. దేవాదులకు నిధులు మంజూరుతో పనులు వేగంగా సాగుతున్నందున ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తాం. రైతులకు రూ.22వేల కోట్ల రుణమాఫీ చేశాం అని వివరించారు.



సాక్ష్యం

రాష్ట్రీయం STATE

హైదరాబాద్
బుధవారం 10 జూన్ 2026



## మెడికల్ కాలేజీకి నూతన ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్య



నర్సంపేట జూన్ 9 (సాక్ష్యం న్యూస్ ) : నర్సంపేట పట్టణంలోని జిల్లా స్థాయి మెడికల్ కాలేజీకి నూతన ప్రిన్సిపల్ గా డా. సంధ్య నియమితులయ్యారు. మంగళవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి స్టాఫ్ ఏడీ సాజిద్ అలీ, ఆఫీస్ సూపరింటెండెంట్, టీ. ఎన్.జీ.ఓ స్టేట్ ఈసీ మెంబర్ ఎండీ. మొయిజుద్దీన్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవీందర్ తదితరులు నూతన ప్రిన్సిపల్ కి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## గిరిజన ఉద్యమ నాయకుడు బిర్స ముండా వర్ధంతి



మహబూబాబాద్ జూన్ 9 (సాక్ష్యం న్యూస్ ) : మహబూబాబాద్ పట్టణంలో బిర్సాముండా వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిలుగా హాజరైన కాంగ్రెస్ పార్టీ ఎస్ టీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుగులోత్ వెంకట్ నాయక్, బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ముంజాల రాజేందర్ గౌడ్ లు బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళీలు అర్పించారు. ఈ సందర్భంగా వెంకట్ నాయక్ మాట్లాడుతూ గిరిజన ఉద్యమా నాయకుడు బిర్స ముండా భారతదేశంలోని ప్రముఖ స్వతంత్ర పోరాటనాయకులు. ఆయన జార్ఖండ్ ప్రాంతంలోని ముండా తెగకు చెందినవారన్నారు. బ్రిటిష్ పాలనకు అలాగే స్థానిక జమీందారుల దోపిడీకి వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి ఉద్యమం నడిపిన మహా నాయకుడు అని కొనియాడారు. ఈ ఉ ద్యమాన్ని ఉ ల్గులాన్ అనగా మహా తి ం ు గ ు బా టు చేశాడు. గిరిజనుల భూమి హక్కుల కోసం పోరాటం చేసిన నాయకుడు ఆత్మగౌరవం స్వయం పాలన కోసం ఉ ద్యమం నడిపినటువంటి నాయకుడు. ఇతను చిన్న వయసులోనే అనగా 25 సంవత్సరాల వయసులోనే మరణించడం జరిగింది. బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ముంజాల రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ వారు బహుజన నాయకత్వం,ప్రాముఖ్యతను వివరించారు. సమాజ అభివృద్ధి, ప్రజల సంక్షేమం మరియు యువత భాగస్వామ్యంపై, ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. బహుజన రాజ్యమే అంతిమ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్టీ సెల్ టౌన్ అధ్యక్షుడు తేజావత్ శంకర్ నాయక్, ఎస్టీ సెల్ బోడ రాము టౌన్ వైస్ ప్రెసిడెంట్, అల్లి దుర్గేష్ టన్ ఓబీసీ అధ్యక్షులు, టౌన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే గఫూర్, బోడ శ్రావ్య నాయక్ ఆదివాసి నాయకులు, కొత్త యుగేందర్ ,బానోత్ బద్రమ్మ భూక్య రాధా, బోడ అలీ, పల్లి రాములు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సంఘ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వండి

● కలెక్టర్, డీఈవోలకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ విజ్ఞప్తి





హైదరాబాద్, జూన్ 9 (సాక్ష్యం న్యూస్ ) : హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరాలలో ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) హైదరాబాద్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జిల్లా కమిటీ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో బాగంగా వారి పిల్లల చదువులకు సహకరించాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులు వేతనాలు సరిగా లేక నెలవారీ ఆదాయం లేక వారి పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నారని,ఈ పరిస్థితిలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని వారు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రాయితీలు అమలు చేయాలని కోరారు. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ను కలిసి వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్, పి. సంతోష్ కుమార్, అడ్వయిజర్ గోవింద్ నాయక్, టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య తదితరులున్నారు. అనంతరం వారు హైదరాబాద్ జిల్లా విద్యాధికారి(డీఈఓ) యాదయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.

## ధరల పెంపుతో దేశంలో ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం

● తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ



వరంగల్ జూన్ 9 (సాక్ష్యం న్యూస్ ) : అంతర్జాతీయ మార్కెట్ నెపంతో కేవలం ఒకే నెలలో పలుమార్లు ఇంధన ధరలను పెంచి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడం దుర్మార్గమని పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్, పెట్రోల్ మరియు డీజిల్ ధరలను వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో గాంధి భవన్ నుండి గన్ పార్క్ వరకు మహా నిరసన ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలను ఏకంగా 4 సార్లు పెంచడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంతరం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రజలపై ఈ విధంగా ధరల భారం మోపడం అత్యంత దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై విధించిన అధిక ఎక్సైజ్ డ్యూటీ వల్లనే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ధరలు పెరగకుండా కేంద్ర ప్రభుత్వం ఎందుకు చమురు సంస్థలపై ఒత్తిడి తీసుకురావడం లేదు. ఎన్నికలకు ముందు ఒక మాటా, ఎన్నికలు అయిపోయాక ఇంకో మాటా ? ఇది కేంద్ర ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనం. ఈ సుంకాన్ని వెంటనే తగ్గించి సామాన్యులకు ఊరట కలిగించాలి. అంతర్జాతీయ మార్కెట్ నెపంతో కేవలం ఒకే నెలలో పలుమార్లు ఇంధన ధరలను పెంచి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడం దుర్మార్గం. నాడు కాంగ్రెస్ హయాంలో గ్యాస్ ధర కొద్దిగా పెరిగితేనే రోడ్లపైకి వచ్చి నాటకాలు ఆడిన నాయకులు.. ఈరోజు ధరలు ఆకాశాన్ని తాకుతుంటే ఎక్కడ దాక్కున్నారు? అని నేను అడుగుతున్నాను. ఇంధన ధరలు పెరగడం అంటే కేవలం వాహనాల ఖర్చు పెరగడం కాదు.. నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పప్పులు, ఉప్పుల ధరలు కూడా అమాంతం పెరిగిపోవడం. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్రతి వస్తువుపై పన్నులు బాదుతూ, ధరలు పెంచుతూ ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వానికి నేను ఒకటే హెచ్చరిక చేస్తున్నాను. సామాన్య మహిళల ఓట్లతో గద్దెనెక్కి.. అదే మహిళల వంటింటి బడ్జెట్‌ను అస్తవ్యస్తం చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారు? కార్పొరేట్ సంస్థల లాభాల కోసం ప్రజల రక్తాన్ని పిండుతుంటే చూస్తూ ఊరుకోవడానికి ఇక్కడ ఉన్నది చేతకాని వాళ్లు కాదు.. వీరు తెలంగాణ మహిళా కాంగ్రెస్ సింహాలు! మన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెడుతూ, 'మహాలక్ష్మి పథకం' ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ ఆదుకుంటుంటే.. కేంద్ర ప్రభుత్వం మాత్రం గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచుతూ మహిళల నడ్డి విరుస్తోంది. గతంలో కాంగ్రెస్ హయాంలో సిలిండర్ ధర తక్కువగా ఉంటేనే నాడు నానా యాగి చేసిన బీజేపీ నాయకులు, ఇప్పుడు ధరలు వెయ్యి రూపాయలు దాటినా నోరు మెదపకపోవడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, బడా కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన ధరలను తగ్గించకపోతే మహిళల ఆధ్వర్యంలో దేశవ్యాప్త పోరాటాలు ఉధృతం చేస్తాం. మహిళా శక్తి ఏంటో కేంద్ర ప్రభుత్వానికి చూపిస్తామని ఎర్రబెల్లి స్వర్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర మహిళా కార్యవర్గ కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకులు , మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులైన బాలలకు ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

● కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జూన్ 9 (సాక్ష్యం న్యూస్) : దేశ నిర్మాణంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన బాలలను గుర్తించి ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ -2026 కోసం నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ధైర్యసాహసం, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు-సంస్కృతి, విజ్ఞాన శాస్త్రం మరియు సాంకేతిక రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన 18 సంవత్సరాల లోపు బాలలు ఈ పురస్కారానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులైన బాలల ప్రతిభను జాతీయ స్థాయిలో గుర్తించి గౌరవించేందుకు ఈ అవార్డులుఅందజేయబడతాయని తెలిపారు. నామినేషన్లు రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించబడతాయని, అర్హులైన బాలల వివరాలను సంబంధిత అధికారులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు గుర్తించి సిఫారసు చేయాలని కోరారు. బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలు, దివ్యాంగులలోని ప్రతిభావంతులను ప్రత్యేకంగా గుర్తించి నామినేషన్లు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్-2026 నామినేషన్లకు జూలై 31, 2026 చివరి తేదీ కాగా, జిల్లా స్థాయిలో పరిశీలన కోసం సంబంధిత వివరాలను జూన్ 30, 2026లోగా కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.

## మంచినీటి సరఫరా చేయరా !

● సరఫరా చేయకపోతే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తాం ● వాటర్ వర్క్స్ డీజీఎం ను నిలదీసిన బిజెపి నాయకుడు వినయ్



హైదరాబాద్, జూన్ 9, ( సాక్ష్యం న్యూస్ ) : గాంధీనగర్ డివిజన్ పరిధిలోని అరుంధతి నగర్, సబర్మతి నగర్ తదితర బస్తీలో గత నాలుగు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోయిందని, నీటి సరఫరా చేస్తారా.. చేయరా అని దోమలగూడ వాటర్ వర్క్స్ డీజీఎం వెంకట్ రెడ్డిని బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ నిలదీశారు. డివిజన్ పరిధిలోని అరుంధతి నగర్, సబర్మతి నగర్ బస్తీల్లో గత కొన్ని రోజులుగా మంచినీటి సరఫరా రావడంలేదని మంగళవారం దోమలగూడ వాటర్ వర్క్స్ డీజీఎం వెంకట్ రెడ్డిని బస్తీ వాసులతో కలిసి వినయ్ కుమార్ మాట్లాడారు. గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పావని ఫిర్యాదు, సూచనల మేరకు వినయ్ కుమార్ డిజిఎం ను కలిసి మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఆ బస్తీల్లో మంచినీటి సరఫరా చేయడం లేదని వినయ్ కుమార్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రజలకు సురక్షిత మంచినీటిని అందజేయడంలో వాటర్ వర్క్స్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఇప్పటికే రంగు నీళ్లు, కలుషిత నీటి సరఫరాతో అనారోగ్యం పాలై, ఆందోళన చెందిన డివిజన్ ప్రజలకు ఇప్పుడు నీటి సరఫరా నిలిపివేయడం వాటర్ వర్క్స్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని అన్నారు. వెంటనే మంచినీటి సరఫరా అందించకపోతే డివిజన్ ప్రజలతో కలిసి జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని వినయ్ కుమార్ హెచ్చరించారు. ఇందుకు వాటర్ వర్క్స్ డిజిఎం వెంకట్ రెడ్డి స్పందించారని, ముఖ్యమైన పైపులైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిచిపోయిందని రేపటికల్లా పనులు పూర్తిచేసి మంచినీటిని అందజేస్తామని హామీ ఇచ్చారని వినయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, బస్తీ వాసులు లక్ష్మయ్య, రాము, యాదగిరి, ధనరాజ్, రవిచంద్ర, శ్రీను, ప్రశాంత్, మహిళలు పాల్గొన్నారు.

## కుంగిపోయిన మ్యాన్ హోల్‌కు మరమ్మత్తులు చేయండి

● బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రేషశీ మల్లేష్



హైదరాబాద్, జూన్ 9, ( సాక్ష్యం న్యూస్ ) : హైదరాబాద్ ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ డివిజన్ ఎస్ఆర్టి కాలనీ నుండి రాంనగర్ చౌరస్తా వైపు వెళ్లే ప్రధాన రహదారిలో కుంగిపోయిన మ్యాన్ హోల్ కు మరమ్మతులు చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు రేషం మల్లేష్ కోరారు. కుంగిపోయిన మ్యాన్ హోల్ ను మంగళవారం రేషం మల్లేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా రేషం మల్లేష్ మాట్లాడుతూ... నిత్యం రద్దీగా ఉండే రాంనగర్ చౌరస్తా వైపు వెళ్లే ప్రధాన రహదారిలో మ్యాన్ హోల్ కుంగిపోయి ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ విషయం పై వాటర్ వర్క్స్ మేనేజర్ శివ సాయి స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సిరిగిరి శ్యామ్, రాకం సత్యనారాయణ, బోసు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



వరంగల్,09 జూన్ (సాక్ష్యం) త్రైమాసిక తనిఖీ షెడ్యూల్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం ఎనుమాముల మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎం గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, ప్రవేశ నియంత్రణ చర్యలను పరిశీలించారు. గోదాం వద్ద అమలులో ఉన్న భద్రతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణపై పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని నిబంధనలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ మరియు ఎన్నికల విభాగ డిటి రంజిత్, సంబంధిత అధికారులు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాద భీమా చెక్‌ను అందజేసిన సీపీ



హనుమకొండ, జూన్ 9 (సాక్ష్యం) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా మంగళవారం ప్రమాద భీమా చెక్ ను అందజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏ. ఆర్. కానిస్టేబుల్ గా పని చేస్తున్న ఆర్. సతీష్ గత సంవత్సరం మే 15వ తారీకు స్టేషన్ ఘన్ పూర్ మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మరణించాడు. దీనితో మరణించిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా 5లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్ అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి అందాల్సిన బెనిఫిట్స్ త్వరగా అందజేయాలని సీపీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, సూపరింటెండ్ సంధ్య, సహాయకులు తులసి పాల్గొన్నారు

## నేషనల్ లోక్ అదాలత్ "ను
# ప్రతిఒక్కరు వినియోగించుకోవాలి

**● కాజీపేట ట్రాఫిక్ పోలీస్ ఇన్ స్పెక్టర్ వెంకన్న**



హనుమకొండ, జూన్ 9 (సాక్ష్యం) వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ , మైనర్ డ్రైవింగ్ కేస్ లలో వాహనం సీజ్ చేయబడితే జూన్ 10 నుండి 20 వరకు కాజీపేట్ రైల్వే సెకండ్ క్లాస్ కోర్టులో "నేషనల్ లోక్ అదాలత్ "లో హాజరై కేసు క్లోజ్ చేసుకోగలరని విజ్ఞప్తి చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వారి ఆధార్ కార్డు జిరాక్స్ వెహికల్ డాక్యుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్స్ కేసు ఉన్నవారు ఆధార్ కార్డు, లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న రశీదు, మైనర్ డ్రైవింగ్ కేసులో బర్త్ సర్టిఫికెట్ లేదా ఎస్ఎస్సి మెమో సమర్పించి తక్కువ జరిమానాతో కేసు క్లోజ్ చేసుకోవచ్చని సూచించారు. 2020 నుండి 2024 మధ్యలో ద్విచక్ర వాహనాలు డ్రంకెన్ డ్రైవ్, వితౌట్ డ్రైవింగ్ లైసెన్సు కేసు, పెండింగ్ చలాన్ కేసులో,ఇతర ఏదైనా కారణం తో కాజీపేట ట్రాఫిక్ పోలీస్ వారికి పట్టుబడి, అట్టి వాహనం ట్రాఫిక్ పోలీస్ వారి అధీనం లో ఉన్నచో, అట్టి వాహనం కి సంబంధిచిన సరియగు పత్రాలు తీసుకొని కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కి వచ్చి వాహనాన్ని తీసుకొని వెళ్లగలరని,ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు.




## ఘనపూర్ పోలీస్ స్టేషన్‌ను
# ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



(సాక్ష్యం) జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 8: ఘనపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ. జిల్లాలో పోలీసు సేవలను మరింత మెరుగుపర్చే దిశగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ మంగళవారం ఘనపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించి, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు.

## ఈవిఎం, వివి ఫ్యాట్ గోదామును
# తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ శర్మ



(సాక్ష్యం) జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 8 : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎం, వివి ఫ్యాట్ గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు వీవీపాట్ యంత్రాల భద్రతను పరిశీలించారు. గోదాంలో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, సీసీటీవీ పర్యవేక్షణ, అగ్ని మాపక పరికరాలు, డబుల్ లాక్ సిస్టమ్ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే, యంత్రాల నిర్వహణ రికార్డులు, స్ట్రాంగ్ రూమ్ రిజిస్టర్లను తనిఖీ చేసి, ఎన్నికల సంగం సూచించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత నిష్పాక్షికత కోసం ఈవిఎంల, వివి ఫ్యాట్ ల భద్రత అత్యంత కీలకమని ఎన్నికల సంగం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయనున్నామని తెలిపారు. గోదాంలో ఉన్న అన్ని యంత్రాలు సక్రమంగా భద్రపరచబడి ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో సంతకాలు చేసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తాళం వేసి సీల్ వేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నవీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా
# ఫోటో కన్ స్టైల్ గ్రేడింగ్‌లో ప్రతిభను చూపిన విద్యార్థులు





చండూర్ (సాక్ష్యం) జూన్ 9 జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా. షాటోకన్ స్టైల్. బెల్ట్ గ్రేడింగ్ లో చండూరు విద్యార్థు లు తమ యొక్క కరాటే నైపుణ్యం ప్రదర్శించుకున్నారు మంగళవారం నిర్వహించిన చండూర్ జెడ్పిహెచ్ఎస్ హై స్కూల్ లో కార్యక్రమానికి ముఖ్య అతిథులు కోడి వెంకన్న. వైస్ చేర్మెన్. భూతరాజు దశరథ. పాల్గొని మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ ఎంతగానో దోహద పడుతుందని ప్రతి ఒక్కరూ శిక్షణలో పాల్గొనాలని విద్యార్థులకు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐతరాజు మల్లేష్. మారగోని ఆంజనేయులు.... గ్రాండ్ మాస్టర్ రాపోలు సుదర్శన్ కరాటే మాస్టర్ విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారు కరాటే శిక్షణ మాస్టర్ కారింగు రవి ని అభినందించారు. అనంతరం కరాటే శిక్షణ మాస్టర్ కారింగు రవి మాట్లాడుతూ ఆగస్టులో నిర్వహించే ఇంటర్నేషనల్ జపాన్ కరాటే టోర్నమెంట్ క్యాంపుకు తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు సెలక్ట్ అయ్యారని ఆనందం వ్యక్తం చేశారు.

# మాజీ ఎమ్మెల్యే మల్లయ్యా మీ ఐదేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా

**ఉమ్మడి నల్గొండ జిల్లా మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు రాయపూడి వెంకటనారాయణ**

కోదాడ, జూన్ 9( సాక్ష్యం) కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ని విమర్శించే ముందు, మాజీ ఎమ్మెల్యే మల్లయ్య హయాంలో జరిగిన అవినీతి గురించి మాట్లాడితే బాగుంటుంది అని ఉమ్మడి నల్గొండ జిల్లా మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు రాయపూడి వెంకటనారాయణ అన్నారు. మంగళవారం కోదాడలో సమావేశంలో మాట్లాడుతూ మల్లయ్య హయాంలో జరిగిన దళిత బంధు అవినీతి కానీ, మట్టి కుంభకోణం కానీ, గంజాయి కుంభకోణం కానీ దేని మీద అయినా చర్చించటానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు, మీరు సిద్ధమా అని సవాల్ విసిరారు. మల్లయ్య లాగా పదవులు అమ్ముకోవడం ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి అలవాటు లేదని,నిజాయితీగా పనిచేసే అధికారుల మీద వారి ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా మాట్లాడటం తగదన్నారు. కోదాడ నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక మహిళ ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఇది సబబు కాదని అన్నారు.



# కాంగ్రెస్ కుట్రలను ఓడిద్దాం.. సింగరేణిని కాపాడుకుందాం

**● 137 ఏండ్ల చరిత్రలో ఎన్నడూ లేనివిదంగా కొత్తగా నిబంధనలు ● 12వ తేదీన హరీష్ రావు సభను విజయవంతం చేద్దాం**

**● మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి**



(సాక్ష్యం) జయశంకర్ -భూపాలపల్లి, జూన్ 8 : సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను కుట్రలను ఓడిద్దాం.. సింగరేణిని కాపాడుకుందాం కార్మిక లోకం ఏకం కావాలి అంటూ భూపాలపల్లి సింగరేణి ఏరియా కెటికె -1 ఇంక్లైన్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి తెలంగాణ సింగరేణి బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు,పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు, కార్మికులు తదితరులు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు బానిసలు అవుదామా లేదా వారి అక్రమాలపై తిరగబడదామ నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది. కొంతమంది మమ్మల్ని అంటున్నారు మీరు గుర్తింపు సంఘం నాయకులుకారు మీకు ఎటువంటి బాధ్యత లేదు అని, మరీ ఈ గుర్తింపు సంఘాలు కార్మికుల పక్షాన మాట్లాడనప్పుడు, వాళ్ళ హక్కులను పరిరక్షణకై మా మీద గురుతరమైన బాధ్యత ఉంది. సింగరేణి ఇన్వాలిడేషన్ ఒక్క సమస్య అయితే, అసలు సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. నేటి ప్రభుత్వంలో కార్మికుల జీతాలు ఇవ్వడం కొరకు ఏ బ్యాంకు ఓడి ఇస్తదా అని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి కనపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బిల్స్ ఇవ్వకపోగా దాదాపు 55 వేల కోట్ల రూపాయలు సింగరేణి సంస్థకు బాకీ పడ్డది. దీని వల్ల సింగరేణి సంస్థ దివాళా తీసే పరిస్థితి ఏర్పడింది. కేసీఆర్ నాయకత్వంలో బొగ్గు టెండర్లు ఎటువంటి రాజకీయా ప్రమేయం లేకుండా నిర్వహించడం జరిగింది.

## ఇంటర్, డిగ్రీ ప్రభుత్వ కళాశాలల
# ఏర్పాటులో నెరవేరని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హామీ

**● సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు**



పాలకుర్తి, జూన్ 09 (సాక్ష్యం): పాలకుర్తిలో ఇంటర్ డిగ్రీ కళాశాలను ఈ విద్యా సంవత్సరంలోనే ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం పాలకుర్తి మండలం లోని గూడూరు గ్రామంలో సిపిఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి సిపిఎం మండల కమిటీ సభ్యులు ఏదునూరి మదార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజు పాల్గొని మాట్లాడుతూ పాలకుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాల లేకపోవడంతో గ్రామీణ పేద విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లి అధిక ఫీజులు కట్టలేక విద్యకు దూరమైతున్న పరిస్థితి ఏర్పడుతుందని వారన్నారు.తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలనూ కళాశాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు.ప్రభుత్వ విద్యా సంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు అవసరమైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తూ ప్రైవేటు విద్యాసంస్థలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నాయని ఆరోపించారు.విద్యాసంస్థల్లో ఫీజుల పేరిట జరుగుతున్న దోపిడి పై ప్రభుత్వాలు ఎలాంటి నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని ఫలితంగా తల్లిదండ్రులు తమ సంపాదనలో సగానికి పైగా పిల్లల విద్యా కోసం ఖర్చు చేయవలసి వస్తుందని దీంతో అనేక కుటుంబాలు అప్పుల పాలైతున్నరని తెలిపారు.వైద్య రంగంలోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉందని ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా సౌకర్యాలు వైద్య సిబ్బంది ఆధునిక పరికరాలు లేకపోవడంతో ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించవలసి వస్తుందని ఈ పరిస్థితి అవకాశంగా మార్చుకున్న కార్పొరేట్ ప్రైవేటు ఆసుపత్రిలు రోగుల నుంచి భారీ మొత్తంలో బిల్లులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య ఖర్చులపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా బిల్లులు విధిస్తూ ప్రజల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తున్నాయని విమర్శించారు.ఈనెల 13 14 15 తేదీలలో బచ్చన్నపేట మండలంలో రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని వారు కోరారు.విద్య వైద్య రంగాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించేందుకు సర్వేలు నిర్వహిస్తామని సర్వేల్లో వెలుగులోకి వచ్చే సమస్యల ఆధారంగా దశల వారి ఉద్యమాలు ఆందోళన చేపట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు.విద్య వైద్యం వ్యవసాయం రైతుల సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, మండల కమిటీ సభ్యులు మాసంపల్లి నాగయ్య, ఏదునూరి మదార్, బెల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా విస్తృత సమావేశం

**జర్నలిస్టుల సంక్షేమమే ప్రదాన లక్ష్యం: జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్**







భూపాలపల్లి జూన్ 9 (సాక్ష్యం) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాళేశ్వరం జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సాధన, సంఘం బలోపేతమే ధ్యేయంగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కాళేశ్వరంలో జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, హెల్త్‌కార్డు సభ్యుడు సామల శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంకణాల సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇటీవల మృతి చెందిన జర్నలిస్టులను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు.జర్నలిస్టుల సంక్షేమం, హెల్త్‌కార్డుల జారీ, ఇళ్ల స్థలాల కేటాయింపు, జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్ అమలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే మార్గమని, రాష్ట్రవ్యాప్తంగా పాత్రికేయుల సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు.అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలు ప్రతి జర్నలిస్టుకు అందేలా సంఘం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల సాధనలో టీయూడబ్ల్యూజే చేసిన సేవలను గుర్తు చేస్తూ ప్రతి పాత్రికేయుడు సంఘంతో అనుబంధం పెంచుకోవాలని పిలుపునిచ్చారు. సంఘ బలోపేతానికి సభ్యత్వ నమోదు కీలకమని పేర్కొంటూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని జర్నలిస్టులందరూ సభ్యత్వాలు నమోదు చేసుకుని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు.




# అవినీతి పై బహిరంగ చర్చలకు సిద్ధమేనా

**కోదాడ కాంగ్రెస్ పార్టీ నాయకులు రావెల కృష్ణారావు, మైలిశెట్టి భాస్కర్**

కోదాడ జూన్ 09, (సాక్ష్యం) మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, రాజకీయ అక్కసుతో చేసిన వ్యాఖ్యలేనని కోదాడ కాంగ్రెస్ పార్టీ నాయకులు రావెల కృష్ణారావు మైలిశెట్టి భాస్కర్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం కోదాడలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా జరుగుతుండటాన్ని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే తన మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే బహిరంగంగా నిరూపించాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లేదా అధికారులకు ముడుపులు అందుతున్నాయని ఆరోపించడం సులభమేనని, అయితే ఎవరైనా అధికారి ముడుపులు ఇచ్చినట్లు ఆధారాలతో నిరూపించగలరా అని ప్రశ్నించారు. ముడుపులు ఇచ్చిన అధికారి ఎవరో ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. "దొంగే దొంగ అన్న చందంగా" మాజీ ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయన హయాంలోనే అవినీతి, అక్రమ వసూళ్లు జరిగాయనే ఆరోపణలు అప్పట్లో పత్రికల్లో వచ్చాయని గుర్తు చేశారు. అధికారుల నుంచి అక్రమ వసూళ్లు జరిగాయంటూ అప్పట్లో అనేక కథనాలు వెలువడ్డాయని, వాటిపై ప్రజల్లో తీవ్ర చర్చ జరిగిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వంటి నాయకులపై ఆధారాలు లేకుండా విమర్శలు చేయడం సూర్యుడిపై ఉమ్మి వేసినట్లేనని వ్యాఖ్యానించారు. కోదాడలో ఒక్క పైసా లంచం తీసుకున్నట్లు నిరూపించగలిగితే ప్రజల ముందుకు రావాలని సవాల్ చేశారు. కోదాడ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని, రాజకీయ ఆరోపణల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలపై అవసరమైతే బహిరంగ చర్చకు సిద్ధమని, కానీ ఆ చర్చ వాస్తవాలు, ఆధారాలపైనే జరగాలని స్పష్టం చేశారు



## ఆంజనేయ స్వామికి
# అభిషేకం నిర్వహిస్తున్న పూజారి

యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్. యాదాద్రి పుణ్యక్షేత్రంలో మంగళవారం నిత్యారాధనలతో పాటు క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామిని కొలుస్తూ ఆకు పూజ పర్వాలను శాస్త్రో క్తంగా నిర్వహించారు. యాదాద్రి కొండ పై అనుబంధ శివాలయం చెంతన ఉన్న క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకు పూజను ఘనంగా నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చించి లలితాపారాయణం చేశారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ఈ పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మంగళవారం వివిధ కైంకర్యాలలో 25,83,536/- ఆదాయం వచ్చినదని ఆలయ అధికారులు తెలిపారు.



## ఉత్తమ్ దంపతుల పై నిరాధార ఆరోపణలు చేసినందుకు డీఎస్పీ ఫిర్యాదు

### కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు, పిల్లుట్ల శ్రీనివాస్



**కోదాడ జూన్ 09, (సాక్ష్యం)**
తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ పద్మావతి రెడ్డిలపై నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పై కాంగ్రెస్ నాయకులు రావెల్ల కృష్ణారావు, పిల్లుట్ల శ్రీనివాస్, లు మంగళవారం స్థానిక డిఎస్పీకి ఫిర్యాదు కి చేశారు. అనంతరం మాట్లాడుతూ హుజూర్నగర్, కోదాడ నియోజకవర్గాలలో వేలాదికోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తుంటే, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ రాజకీయ లబ్ధి కోసం నిరాధారమైన ఆరోపణ చేయటం సరైనది కాదన్నారు. అవినీతి ఆరోపణల పై ఆధారాలు ఉంటే సంబంధిత అవినీతి నిరోధక శాఖలకు ఫిర్యాదు చేయాలి, లేదా ప్రజాక్షేత్రంలో ఆధారాలను బహిర్గతం చేయాలి తప్ప, స్థానిక ఎమ్మెల్యేను, అధికారులను, కించపరిచే విధంగా వారిపై అవినీతి ఆరోపణలు చేయటం మానుకోవాలని హెచ్చరించారు. రాజకీయ లబ్ధి కోసం కోదాడ నియోజకవర్గంలోని ప్రభుత్ అధికారులను, అధికారపక్ష నాయకుల పై నిరాధారమైన ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి చేకూరాలని ప్రయత్నించడం హేమమైన చర్యని అన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఆధారాలు లేకుండా ఎవరి పై ఆరోపణలు చేయరాదని, అన్ని రాజకీయ పక్షాలకు విజ్ఞప్తి చేశారు. సరైన ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఫిర్యాదు అందజేసిన వారిలో మైలారి శెట్టి భాస్కర్, పాలడుగు సంజీవ్, షరీఫ్, బాగ్దాద్, కామల్ల ప్రవీణ్, పిడతలు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## క్రీడాభివృద్ధికి కోచ్‌ల సేవలు కీలకం

### - స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచెస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**మహబూబ్‌నగర్, జూన్ 9 ( సాక్ష్యం బ్యూరో )**
స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచెస్ అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా యూనిట్ రూపొందించిన క్యాలెండర్‌ను మంగళవారం స్పోర్ట్స్, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ ఎ. సోనీ బాల దేవి చేతుల మీదుగా అసోసియేషన్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా క్రీడల అభివృద్ధిలో కోచ్‌ల పాత్ర ఎంతో కీలకమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డీవైఎస్‌వో, క్రికెట్ కోచ్ మరియు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జె. రాజశేఖర్ రెడ్డి, అథ్లెటిక్ కోచ్ మరియు ప్రెసిడెంట్ ఎం. సునీల్ కుమార్, స్విమ్మింగ్ కోచ్ జిల్లా ట్రెజరర్ సయ్యద్ అంజాద్, వాలీబాల్ కోచ్ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ అబ్దుల్ రెహ్మాన్ ఖాన్, బాక్సింగ్ కోచ్ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ వి. శంకర్, కబడ్డీ కోచ్ జిల్లా జాయింట్ సెక్రటరీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి, శ్రీకాళహస్తిలో బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు



**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్...**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీకాళహస్తి దేవస్థానం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం, శ్రీకాళహస్తికి చేరుకున్న బీర్ల అయిలయ్య ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ సంప్రదాయాలను అనుసరించి భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కి వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉ



ండాలని, తెలంగాణ అభివృద్ధి మరింత ముందుకు సాగాలని ఆయన స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ని ఆప్యాయంగా పలకరించగా, ఆయన కూడా భక్తులతో మమేకమై మాట్లాడారు. తిరుపతి దర్శనం అనంతరం శ్రీకాళహస్తి స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని ఆయన పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్.**
ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రామచందర్రావు అన్నారు. బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి శిక్షణ శిబిరాలు యాదగిరిగుట్ట శివారులో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన శిక్షణ శిబిరాలను ప్రారంభించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి తరచుగా బిజెపి నేతలపై విమర్శలు చేస్తున్నారని తమ నాయకులను విమర్శించడం తప్ప ఆయన చేస్తున్న అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే చేయాలని ఆ తరువాత కేంద్ర ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించి దాన్ని తీసుకుంటుందని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నెలరోజులు ఆలస్యంగా ధాన్యం కొనుగోలు ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధాన్యం కొనుగోలు పై స్పష్టత లేదని అన్నారు. రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఎయిమ్స్, ఎంఎంటీఎస్ లాంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారులకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తున్నామని తెలిపారు. తాము అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి తమ పార్టీపై లేనిపోని విమర్శలు చేయడం తగదని విమర్శించారు. కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీ ఒకటేనని అన్నారు. ఆ రెండు పార్టీలు కలిసి తమను అకారణంగా విమర్శిస్తున్నాయని అన్నారు. ప్రజలు అంత గమనిస్తున్నారని ప్రజలే ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్తారని అన్నారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు అండగా ప్రభుత్వం

### - మూడేళ్లలో వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా - ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, జూన్ 9 ( సాక్ష్యం బ్యూరో ) :**
సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించే గొప్ప సంక్షేమ పథకమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం 80 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల్లో దాదాపు మూడు వేల మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేద ప్రజలకు కూడా ప్రభుత్వం సహాయం అందిస్తోందని చెప్పారు. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుమారు రూ.3 వేల కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించారు. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిబ్బందిని నియమించామని తెలిపారు. అవసరమైన పత్రాలు సమర్పించిన వారికి మూడు నెలల్లోనే చెక్కులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే వేగవంతమైన వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి "ఇందిరమ్మ జీవన బీమా" పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెంచుతూ వైద్యులను నియమించి మెరుగైన వైద్యం అందిస్తున్నామని, విద్య, వైద్యం, సాగునీటి రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇళ్లు మంజూరు చేశామని, మరో 2,500 ఇళ్ల మంజూరుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్లు షబ్బీర్ అహ్మద్, అవేజ్, తాహేర్, భాను చందర్, మజ్జీద్, ఎంపీ ప్రవీణ్, నాయకులు రాములు యాదవ్, అజ్మత్ అలి, సల్మాన్, లీడర్ రఘు, శరత్, ఫైసల్, అక్బర్, మోయిజ్, అశ్వాక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




## లబ్ధిదారులకు పంపిణీకి సిద్ధంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు

### - శాసనసభ్యులు భత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ డివిజన్ జూన్ 09 (సాక్ష్యం న్యూస్)**
గతంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులన్నీ సంపూర్ణంగా పూర్తయ్యాయని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. త్వరలోనే రాష్ట్ర మంత్రుల సమక్షంలో అర్హులైన లబ్ధిదారులకు ఈ ఇళ్లను అధికారికంగా పంపిణీ చేస్తామనీ తెలిపారు ఇళ్ల సముదాయాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులతో కలిసి స్వయంగా సందర్శించి, ఏర్పాట్లను సమీక్షించారు. మిర్యాలగూడలో గత కొంతకాలంగా అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులన్నింటినీ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించిందని అన్నారు మంగళవారం శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సంబంధిత ప్రభుత్వ అధికారులతో కలిసి ఇళ్ల సముదాయాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో రాజీవ్ గృహ కల్ప పథకం కింద మంజూరైనా ఈ స్థలంలోగత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్స్ ఇళ్ల నిర్మాణం పేరుతో 10 ఏళ్లలో మూడుసార్లు ప్రత్యేక నిధులను మంజూరు చేయించి కూడా పనులు పూర్తిచేయకుండా ఈ ఇళ్ళను పేదలకు చూపించి రాజకీయం చేసే ప్రయత్నాలు చేశారని అన్నారు. ఎన్నికల ముందు కనీసం త్రాగు నీరు, రోడ్డు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు కూడా లేకుండా ఓట్ల కోసం డ్రా సిస్టమ్ పెట్టి ప్రజలను మభ్యపెట్టారని అన్నారు. మేము గత 6 నెలలుగా నిత్యం పర్యవేక్షిస్తూ, మంత్రులు, అధికారుల సహకారంతో ఇక్కడ నివసించడానికి కావాల్సిన మౌలిక వసతులను ప్రత్యేక నిధుల ద్వారా పూర్తి చేయడం జరిగిందని పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి అన్ని మౌలిక వసతుల పనులను అధికారులు నాణ్యతతో పూర్తి చేశారని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలాంటి ఆలస్యం లేకుండా, త్వరలోనే రాష్ట్ర మంత్రుల ముఖ్య అతిథ్యత్వంలో అర్హులైన లబ్ధిదారులకు పూర్తి పారదర్శకంగా ఈ ఇళ్లను అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ చిలుకూరి బాలకృష్ణ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నవీన్ జాతీయ మాలమహానాడు అధ్యక్షులు తాళ్లపల్లి రవి సర్పంచ్ బెజ్జం సైదులు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







## మండల కేంద్రానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

### - సర్పంచ్ ఆరూరి నరేష్

**మాడుగులపల్లి జూన్ 9 సాక్ష్యం;**
మాడుగులపల్లి మండల కేంద్రం లో ఐకెపి సెంటర్ లో నిర్మాణ దశ లో ఉన్న ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ పనులు పరిశీలించుటకు రాష్ట్ర రోడ్డు భవనాల సినిమా ఫోటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం మాడుగుల పల్లి మండల కేంద్రానికి రావడం జరుగుతుందని స్థానిక సర్పంచ్ ఆరూరి నరేష్ తెలిపారు. అనంతరం చెరువుపల్లి లో గ్రామపంచాయితీ కార్యాలయ, వివో భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమం లో పాల్గొంటారని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.




## ఘనపూర్‌లో రూ.60.62 కోట్ల విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం



**జనగామ , జూన్ 9 (సాక్ష్యం)**
జనగామ జిల్లా ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలో రూ. 60.62 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు విద్యుత్ అభివృద్ధి పనులకు సంబంధించిన నూతన సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తోందన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం పేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తోందని తెలిపారు. ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గం అభివృద్ధి పరంగా రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు వల్ల రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఒకప్పుడు వలసలకు కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతం దేవాదుల ప్రాజెక్టు, ఉచిత విద్యుత్ సౌకర్యాలతో వ్యవసాయ రంగంలో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రఘునాథపల్లి 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులకు నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, రైతులు మరియు ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, రూ. 60.62 కోట్ల వ్యయంతో ఘనపూర్ నియోజకవర్గంలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రారంభించడం ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. లోడ్ మేనేజ్‌మెంట్ మెరుగుపడి ప్రజలకు నిరంతర విద్యుత్ అందుతుందని చెప్పారు. ట్రాన్స్‌కో అధికారులు కూడా విద్యుత్ రంగ అభివృద్ధి కార్యక్రమాలను అభినందిస్తూ, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్విని రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, కోఆపరేటివ్ చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





### ఎస్పీఎఫ్ సిబ్బంది 10 కిలోమీటర్ల

## పరుగు, మాడ విధులలో 'స్వచ్ఛ భారత్'





**యాదగిరి గుట్ట సాక్ష్యం న్యూస్..**
టీజీ ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లాక్రా ఆదేశాల మేరకు, యాదగిరిగుట్ట ఆలయ భద్రతా విభాగం సిబ్బంది మంగళవారం తులసి కాటేజ్ నుండి మల్లాపురం వరకు 10 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. అనంతరం కొండ పైన మాడ విధులలో 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్ కే. శేషగిరి రావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా సురక్షితంగా తరలించారు. ఈ సేవలో ఎస్ఐ రవి, ఏఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువుపల్లికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాక

### - పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన /ప్రారంభోత్సవం

**మాడుగులపల్లి జూన్ 9 సాక్ష్యం;**
తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బుధవారం మాడుగులపల్లి మండలంలోని చెరువుపల్లి గ్రామంలో పర్యటించనునట్టు గ్రామ సర్పంచ్ వద్దే సైదిరెడ్డి తెలిపారు. గ్రామంలో నూతనంగా మంజూరైన గ్రామపంచాయతీ భవనం, వివో భవనం, ప్రారంభోత్సవం చేసి



రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ లేదా ఇతర స్థానిక మౌలిక వసతుల పనులకు ఆయన శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటారు. మంత్రి రాకను పురస్కరించుకుని చెరువుపల్లి పరిసర ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు భారీ స్వాగత ఏర్పాట్లు మరియు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ పర్యటనకు సంబంధించి స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.



# భారత్‌కు ఎలాంటి ఉపయోగం లేని మ్యాచ్

అఫ్ఘానిస్థాన్‌పై ఇన్నింగ్స్, 300 పరుగుల చారిత్రాత్మక విజయం సాధించినప్పటికీ టీమిండియాకు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్లు లభించలేదు. అఫ్ఘాన్ క్రికెట్ ప్రమోషన్ కోసం జరిగిన మ్యాచ్ కావడంతో దీనిని డబ్ల్యూటీసీ పరిధిలోకి చేర్చలేదు. ప్రస్తుతం 48.15 విన్నింగ్ పర్సంటేజ్‌తో పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉన్న భారత్.. ఫైనల్ రేసులో నిలవాలంటే రాబోయే 9 టెస్టుల్లో (శ్రీలంక, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సిరీస్‌లు) కనీసం 7 మ్యాచ్‌లు గెలవాల్సి ఉంది. అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్‌లో టీమిండియా రికార్డ్ విజయాన్ని అందుకుంది. 94 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే కని వినీ ఎరుగని విజయాన్ని కైవసం చేసుకుంది. ఏకంగా ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో గెలుపొంది, టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే తమ అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది. అయితే ఇంత భారీ విజయం సాధించినా.. ఈ మ్యాచ్‌తో భారత్‌కు ఎలాంటి ఉపయోగం లేదు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్‌లో భారత్ ఖాతాలో ఒక్క పాయింట్ కూడా చేరలేదు. టెస్ట్ క్రికెట్‌కు ఆదరణ పెంచేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ).. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ)ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రెండేళ్ల వ్యవధిలో టెస్టు హోదా ఉన్న జట్లు ఆడిన మ్యాచులకు పాయింట్లు కేటాయిస్తారు.

మ్యాచులో గెలిచిన జట్టుకు 12 పాయింట్లు, డ్రా అయితే 4, టై అయితే ఆరు పాయింట్లు ఇస్తారు. ఇక అన్ని జట్లూ మ్యాచులు ముగిసే సరికి టాప్-2లో ఉన్న జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. అయితే భారత్, అఫ్ఘానిస్థాన్ మధ్య జరిగిన మ్యాచుకు డబ్ల్యూటీసీతో సంబంధం లేదు. అఫ్ఘానిస్థాన్ క్రికెట్‌కు ప్రోత్సాహం అందించేందుకు నిర్వహించిన మ్యాచ్ ఇది. దీంతో ఈ గెలుపుతో టీమిండియాకు ఉపయోగం లేకుండా పోయింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ 2025-27 పాయింట్స్ టేబుల్‌లో ప్రస్తుతం భారత్ 48.15 విన్నింగ్ పర్సంటేజ్‌తో ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఈ సైకిల్‌లో ఇప్పటి వరకు 9 మ్యాచ్‌లు ఆడిన భారత్ 4 గెలిచి మరో నాలుగు ఓడింది. ఒక మ్యాచ్ డ్రా అయ్యింది. గతేడాది ఇంగ్లండ్ పర్యటనతో డబ్ల్యూటీసీ సైకిల్‌ను ప్రారంభించిన భారత్.. ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 2-2తో సమం చేసుకుంది. ఆపై వెస్టిండీస్‌తో సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. కానీ సొంతగడ్డపై దక్షిణాఫ్రికా చేతిలో 2-0తో వైట్ వాష్‌కు గురై.. టేబుల్‌లో ఆరో స్థానానికి పడిపోయింది. ఈ సైకిల్‌లో భారత్ ఇంకా 9 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. శ్రీలంకలో రెండు, న్యూజిలాండ్‌లో రెండు, సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల్లో భారత్ తలపడాలి. ఫైనల్ రేసులో నిలవాలంటే భారత్ ఈ 9 మ్యాచ్‌ల్లో కనీసం ఏడు గెలవాల్సి ఉంది! ప్రస్తుతం టేబుల్‌లో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో, దక్షిణాఫ్రికా రెండో ప్లేసులో ఉంది.

## సన్‌రైజర్స్ కొత్త హెడ్ కోచ్!!?

ఐపీఎల్ 2027 సీజన్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది జరిగే ఐపీఎల్ కోసం కొత్త హెడ్ కోచ్‌ను నియమించాలనే ఆలోచనలో కావ్య మారన్ ఉందని జట్టు వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుత హెడ్ కోచ్ డానియల్ వెటోరి పనితీరు పట్ల సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తదుపరి సీజన్ ప్రారంభానికి ముందే డానియల్ మెటోరిపై వేటు వేసి కొత్త హెడ్ కోచ్‌ను నియమించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే అనుభవజ్ఞుడైన భారతీయ కోచ్‌తో చర్చలు జరుపుతోందని, ఈ వ్యవహారంపై ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని జట్టుకు చెందిన ఓ అధికారి మీడియాకు తెలిపారు. ఐపీఎల్ 2024 సీజన్‌కు ముందు బ్రియాన్ లారా స్థానంలో డానియల్ వెటోరి సన్‌రైజర్స్ హైదరాబాద్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతని పర్యవేక్షణ, ప్యాట్ కమిన్స్ అద్భుతమైన సారథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆ సీజన్ ఫైనల్ చేరింది. కానీ తుది పోరులో కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఓడి టైటిల్‌ను చేజార్చుకుంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో మాత్రం తీవ్రంగా నిరాశపర్చింది. ప్లే ఆఫ్స్ చేరకుండా ఆరో స్థానంలో నిలిచింది. తాజా సీజన్‌లో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. డానియల్ వెటోరి హయాంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆడిన క్రికెట్ శైలి ఐపీఎల్ చరిత్రనే మార్చేసింది. పవర్‌ప్లేలోనే ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగే సరికొత్త వ్యూహాన్ని ఆయన జట్టులో నూరిపోశారు. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్‌లకు పూర్తి స్వేచ్ఛనిచ్చి టీ20 క్రికెట్ ఆడే విధానాన్ని మార్చేశారు. డానియల్ వెటోరి పర్యవేక్షణలో సన్‌రైజర్స్ హైదరాబాద్ మెరుగైన ప్రదర్శనే కనబర్చింది. కానీ టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకున్న టైటిల్ దక్కలేదు. వెటోరి రాకముందు 2021, 2022, 2023 సీజన్లలో ఎస్‌ఆర్‌హెచ్ పాయింట్ల పట్టికలో చివరి స్థానాల్లో నిలిచింది. దాంతోనే కొత్త కోచ్ వేటలో సన్‌రైజర్స్ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ పడినట్లు అర్థమవుతుంది.





## సెంచరీతో మెరిసిన రుతురాజ్ గైక్వాడ్

శ్రీలంక వేదికగా జరుగుతున్న ట్రై నేషనల్ ఏ సిరీస్‌లో రుతురాజ్ గైక్వాడ్ సెంచరీతో మెరిశాడు. ఐపీఎల్‌లో విధ్వంసం సృష్టించి నేషనల్ టీమ్‌లో సెలెక్ట్ అయిన వైభవ్ సూర్యవంశీ కేవలం 14 పరుగులకే అవుట్ కాగా.. రుతురాజ్ గైక్వాడ్ 101 పరుగులు చేశాడు. కెప్టెన్ తిలక్ వర్మ 60 పరుగులు చేయడంతో భారత్ - ఏ జట్టు 50 ఓవర్లలో 277/6 పరుగులు చేసింది. శ్రీలంక - ఏ విజయం సాధించాలంటే 278 పరుగులు చేయాల్సి ఉంది. ట్రై నేషనల్ ఏ సిరీస్‌లో ఐపీఎల్ విధ్వంసకర బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ నిరాశ పరిచాడు. ఐపీఎల్‌లో తన బ్యాట్‌తో విధ్వంసం సృష్టించిన ఈ 15 ఏళ్ల బుల్లి డైనమైట్ ఇంటర్నేషనల్‌లో తడబడ్డాడు. శ్రీలంక - ఏతో జరిగిన మ్యాచ్‌లో మూడు బౌండరీలు బాది 14 పరుగులకే పెవిలియన్ బాట పట్టాడు. రుతురాజ్ గైక్వాడ్ మాత్రం తన క్లాస్ ఇన్నింగ్స్‌తో సెంచరీ బాదాడు. శ్రీలంకలోని డంబుల్లా వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇండియా - ఏ కెప్టెన్ తిలక్ వర్మ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఐపీఎల్‌లో రాణించిన వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, ప్రియాన్ష్ ఆర్య, ఆయుష్ బదోని ఉన్న యువ జట్టుపై భారీ అంచనాలే ఉన్నాయి. ప్రభ్‌సిమ్రాన్ సింగ్ - వైభవ్ సూర్యవంశీ ఓపెనర్లుగా వచ్చిన ఈ మ్యాచ్‌లో భారత్ ఆరంభంలోనే వికెట్ కోల్పోయింది. నాలుగో ఓవర్‌లో ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ 12 బంతుల్లో 14 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. ఆ వెంటనే 11 బంతుల్లో 2 పరుగులు మాత్రమే చేసిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్ పెవిలియన్ బాట పట్టాడు. దాంతో భారత్ 16 పరుగులకే ఓపెనర్లు ఇద్దర్నీ కోల్పోయింది. ప్రియాన్ష్ ఆర్య - రుతురాజ్ గైక్వాడ్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 32 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 32 పరుగులు చేసిన ప్రియాన్ష్ రనౌట్ అయ్యాడు. దాంతో భారత్ 69 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్‌లో వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ - రుతురాజ్ గైక్వాడ్ మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు ఏకంగా 150 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలోనే రుతురాజ్ గైక్వాడ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 114 బంతులు ఆడిన గైక్వాడ్ ఆరు ఫోర్లు, మూడు సిక్సర్లతో 101 పరుగులు చేసి అవుటయ్యాడు. ఆ వెంటనే 97 బంతుల్లో 60 పరుగులు చేసి తిలక్ వర్మ కూడా వికెట్ కోల్పోయాడు. ఆఖర్లో ఆయుష్ బదోనీ 18 బంతుల్లో 24, సూర్యాన్ష్ షెడ్గే 14 బంతుల్లో 26 పరుగులు చేయడంతో భారత్ 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. శ్రీలంక బౌలర్లలో మొహమ్మద్ షిరాజ్ రెండు వికెట్లు పడగొట్టగా, చమీకా కరుణ రత్నే ఒకటి, గరుక సంకేత ఒకటి, వాంజ సహాన్ ఒక వికెట్ తీసుకున్నారు.

## మరోసారి వివాదాల్లో బెన్ స్టోక్స్

ఇంగ్లాండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ మరోసారి వివాదాల్లో చిక్కుకున్నాడు. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు నిబంధనలు ఉల్లంఘించి అర్ధరాత్రి నైట్‌క్లబ్‌కు వెళ్లాడు. అంతేకాకుండా నడిరోడుపై ఓ వ్యక్తితో గొడవపడ్డాడు. ఇది ఘర్షణకు దారి తీసింది. ఒకరినొకరు దాడి చేసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇది ఈబీసీ దృష్టిలో పడింది. దీంతో అతడిపై బోర్డు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. న్యూజిలాండ్ జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉంది. ఈ టూర్‌లో ఇరుజట్లు 3 టెస్టులు ఆడాల్సి ఉంది. ఇందులో భాగంగా రీసెంట్‌గా లార్డ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఇంగ్లాండ్ విజయం సాధించింది. అయితే ఈ సిరీస్ నేపథ్యంలో ఆటగాళ్లు లేట్ నైట్ సమయాల్లో బయటకు వెళ్లడాన్ని నిషేధించింది. కానీ కెప్టెన్ స్టోక్స్‌తో సహా బౌలర్ గస్ అట్కిసన్ గత ఆదివారం నిబంధనలు ఉల్లంఘించి లండన్‌లోని ఓ నైట్‌క్లబ్‌కు వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా ఈ ఇద్దరు క్రికెటర్లు సారాసెన్స్ అకాడమీకి చెందిన రగ్బీ ఆటగాడితో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో ఈ వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో క్రికెటర్లతో ఉన్న ఇంగ్లాండ్ బోర్డు సెక్యూరిటీ టీమ్‌లోని ఒక సభ్యుడు గాయపడ్డాడు. అయితే స్టోక్స్ గానీ, అట్కిన్సన్ గానీ ఈ ఘర్షణలో గాయపడలేదని తెలిసింది. అయితే ఈ వివాదం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డ్ ఈ ఘటనపై విచారణ ప్రారంభించింది. అయితే ఈ ఘటనలో స్టోక్స్ గానీ, అట్కిన్సన్ గానీ ఆ రగ్బీ ఆటగాడిపై దాడి చేయలేదని ఇంగ్లాండ్ క్రికెట్ వర్గాలు తెలిపాయి. రగ్బీ ఆటగాడే అట్కిసన్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించాడని, అయినప్పటికీ క్రికెటర్లు ఎలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడలేదని బోర్డు వర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో స్టోక్స్, అట్కిసన్ తప్పు లేదని బోర్డు నమ్ముతున్నా, జట్టు నిబంధనలు ఉల్లఘించి బయటకు వెళ్లడాన్ని మాత్రం తీవ్రంగా పరిగణిస్తుంది. ఇక పోలీసుల జోక్యం లేకుండానే ఈ వివాదం పరిష్కారమైందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే జట్టు నియమాలను ఉల్లంఘించడం పట్ల ఈసీబీ అసంతృప్తిగా ఉంది. అయితే సిరీస్ మధ్యలో స్టోక్స్, అట్కిసన్ జట్టు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ఒక నైట్‌క్లబ్‌కు వెళ్లడాన్ని బోర్డు సీరియస్‌గా పరిగణిస్తుంది. ఈ ఘటనపై ఇప్పటికే విచారణకు ఆదేశించింది. జూన్ 17న రెండో టెస్టు ప్రారంభం కానుంది. ఆలోపే దీనిపై పూర్తి నివేదికను సిద్ధం చేసే అవకాశం ఉంది. అయితే క్రికెటర్ల క్రమశిక్షణా నియమ ఉల్లంఘనను ఈసీబీ తీవ్రంగా పరిగణిస్తే, స్టోక్స్ తన కెప్టెన్సీని కోల్పోయే ప్రమాదం ఉందని ఇంగ్లీష్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అలాగే గస్ అట్కిన్సన్‌పై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



# అవకాశం ఇప్పించాలని క్రిస్ గేల్ నన్ను బతిమాలాడు

### ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ సంచలన వ్యాఖ్యలు

వెస్టిండీస్ విధ్వంసకర వీరుడు, యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ తన సాయం కోరాడని ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ తెలిపారు. ఐపీఎల్ 2011 వేలంలో క్రిస్ గేల్ అన్ సోల్డ్ కావడంతో..



అవకాశం ఇప్పించాలని తనను బతిమాలాడని లలిత్ మోదీ గుర్తు చేసుకున్నారు. తనకు చాలా అప్పులు ఉన్నాయని, వాటిని తీర్చాలంటే ఐపీఎల్ ఆడటమే తన ముందున్న ఏకైక మార్గమని గేల్ రిక్వెస్ట్ చేశాడని లలిత్ మోదీ చెప్పుకొచ్చారు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్‌కు చెందిన 'ది ఓవర్‌లాప్ క్రికెట్'షోలో లలిత్ మోదీ ఈ విషయాలను పంచుకున్నారు. 'అది 2011 నాటి మాట. నాకింకా గుర్తుంది. నేను అప్పుడే ఐపీఎల్ నుంచి బయటకు వచ్చి లండన్‌లో సెటిల్ అవుతున్నాను. నాకు మంచి ఫ్రెండ్ అయిన క్రిస్ గేల్‌ను ఐపీఎల్ 2011 వేలంలో ఏ జట్టు కొనుగోలు చేయలేదు. అప్పుడు అతని నుంచి నాకు ఫోన్ కాల్ వచ్చింది. 'వేలంలో నన్ను ఎవరూ కొనుగోలు చేయలేదు'అని గేల్ నాతో అన్నాడు. అయితే గేల్ అప్పటి వరకు సరిగ్గా రాణించలేదు. ఐపీఎల్ అంటేనే అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం. అంతకుముందు అతను కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఆడాడు. ఆ జట్టు తరపున అతను సరిగ్గా ఆడలేదు. ఈ లీగ్‌లో అతను కొంచెం బద్ధకించాడు. అప్పుడు గేల్ నాతో.. 'నాకు చాలా అప్పులు ఉన్నాయి, నా బిల్లులు చెల్లించుకోవడానికి నాకు ఈ అవకాశం చాలా అవసరం' అని రిక్వెస్ట్ చేశాడు. ఆ తర్వాత నేను ఒకరిద్దరికి ఫోన్లు చేశాను. అందరూ క్రిస్ గేల్‌ను వద్దన్నారు. దాంతో నేను మా రోడ్డుకు అవతలివైపు ఉన్న విజయ్ మాల్యా ఇంటికి వెళ్లాను. విజయ్.. క్రిస్ గేల్‌కు ఒక అవకాశం ఇవ్వమని చెప్పాను. దానికి ఆయన.. 'నా దగ్గర ఒక స్థానం ఖాళీగా ఉంది. కానీ అతను బాగా రాణిస్తేనే నేను డబ్బులు చెల్లిస్తాను' అని అన్నాడు.'అని లలిత్ మోదీ చెప్పుకొచ్చారు. ఆ సీజన్‌లో ఆస్ట్రేలియా-డచ్ క్రికెటర్ డిర్క్ నన్నెస్ స్థానంలో ఇంజ్యూరీ రిప్లేస్‌మెంట్‌గా ఆర్‌సీబీలోకి వచ్చిన క్రిస్ గేల్ విధ్వసంకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. 12 ఇన్నింగ్స్‌ల్లో 67.55 సగటు, 183.13 స్ట్రైక్‌రేట్‌తో 608 పరుగులు చేశాడు. రెండు శతకాలు నమోదు చేసిన గేల్.. తన పాత ఫ్రాంచైజీ కేకేఆర్‌పై 55 బంతుల్లో 102 నాటౌట్ అజేయ శతకంతో చెలరేగాడు. జట్టులో ప్రధాన ఆటగాడిగా మారిపోయిన గేల్.. 2013లో అత్యధిక వ్యక్తిగ స్కోర్ 175 నాటౌట్ నమోదు చేశాడు. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఫ్రాంచైజీ లీగ్‌ల్లో మొత్తం 35 టీమ్స్ తరఫున బరిలోకి దిగి 14562 పరుగులు చేశాడు. ఇందులో 22 శతకాలతో పాటు 88 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్‌లో కేకేఆర్, ఆర్‌సీబీతో పాటు పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన గేల్.. 142 మ్యాచ్‌ల్లో 148.96 స్ట్రైక్‌రేట్‌తో 4965 పరుగులు చేశాడు.

## విలేకరిపై హర్మన్‌ప్రీత్ కౌర్ తీవ్ర ఆగ్రహం

జూన్ 12 నుంచి ఇంగ్లాండ్ వేదికగా మహిళల టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుంది. ఈ టోర్నీకి ముందు జరిగిన ప్రెస్ మీట్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తీవ్ర



ఆగ్రహానికి గురయ్యారు. "ఇది మీకు చివరి ప్రపంచకప్ అవుతుందా?" అని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు.. "నేను తప్పుకోవాలని మీరు కోరుకుంటున్నారా?" అంటూ ఎదురు ప్రశ్న వేశారు. 2025 వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత్, ఈ టోర్నీలోనూ అంచనాలతో బరిలోకి దిగుతోందని, ఒత్తిడిని అధిగమించి రాణిస్తామని హర్మన్ ధీమా వ్యక్తం చేశారు. మరో నాలుగు రోజుల్లో మహిళల టీ20 ప్రపంచకప్ ప్రారంభం కానుంది. జూన్ 12 నుంచి ఇంగ్లాండ్ వేదికగా ఈ టోర్నీ జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే ఈ టోర్నీలో పాల్గొనే 12 జట్లూ అక్కడికి చేరుకుని.. సన్నాహకాలు ప్రారంభించాయి. హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా సైతం ముమ్మర సాధన చేస్తోంది. అయితే టోర్నీ ప్రారంభానికి ముందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్.. ఓ దశలో ఆగ్రహానికి గురయ్యారు. విలేకరి వేసిన ప్రశ్నకు ఆమె ఎదురు ప్రశ్న వేశారు. ఈ ప్రెస్ మీట్‌లో ఓ విలేకరి.. "ఈ టీ20 ప్రపంచకప్ మీకు చివరిది అవుతుందా" అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్న హర్మన్‌కు కోపం తెప్పించింది. వెంటనే ఆమె.. "నేను తప్పుకోవాలని మీరు కోరుకుంటున్నారా" అని ఎదురు ప్రశ్న వేశారు. దీనికి సదరు విలేకరి బదులిస్తూ.. "మీ భవిష్యత్ ప్రణాళికల గురించి తెలుసుకునేందుకే ఈ ప్రశ్న అడిగా. టీ20 ఫార్మాట్ నుంచి తప్పుకునేందుకు టైమ్ కాలేదని మీరు భావిస్తున్నందుకు సంతోషిస్తున్నా" అని అన్నారు. అయినా.. హర్మన్ ప్రీత్ కౌర్ కోపం మాత్రం తగ్గలేదు. "మరి అలాంటప్పుడు ఈ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారు?" అని మరోసారి ఎదురు ప్రశ్న వేశారు. కాగా మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో భారత్ విజేతగా నిలిచింది. భారత్ వేదికగా జరిగిన ఈ టోర్నీలో టీమిండియా విజేతగా నిలిచింది. దీంతో ఈ టోర్నీలోనూ భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో ఈ విషయంపై కూడా హర్మన్ మాట్లాడారు. "వన్డే ప్రపంచకప్ తర్వాత మాపై సహజంగానే అంచనాలు వస్తాయి. ఒక రకంగా మహిళల క్రికెట్‌కు ఇది సానుకూల అంశం. వ్యక్తిగతంగా నేను బయటి నుంచి వచ్చే ఒత్తిడి గురించి ఆలోచించకుండా.. ఉండేందుకే ప్రయత్నిస్తా. ప్రస్తుతం ఏం చేయాలనేదానపైనే నా ఫోకస్ ఉంటుంది" అని హర్మన్ ప్రీత్ కౌర్ వ్యాఖ్యానించారు. ఈ టోర్నీలో పాల్గొనే మొత్తం 12 జట్లను రెండు గ్రూప్‌లు విభజించి మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. గ్రూప్-1లో భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ నెదర్లాండ్స్. గ్రూప్-2లో ఇంగ్లండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్, శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్ జట్లు ఉన్నాయి.

## టీమ్‌ఇండియా నుంచి సిరాజ్‌ను తప్పించిన బీసీసీఐ

టీమ్‌ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ విషయంలో బీసీసీఐ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో టీ20 జట్టుకు ఇటీవల సిరాజ్‌ను ఎంపిక చేసింది. అయితే తాజాగా ఆ సిరీస్‌ల నుంచి సిరాజ్‌ను తప్పించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా



అతడికి విశ్రాంతి కల్పించింది. అలాగే ఈ సిరీస్‌ల్లో అతడి స్థానాన్ని ప్రసిద్ధ్ కృష్ణతో భర్తీ చేయనున్నట్లు పేర్కొంది. ఆ మేరకు అధికారికంగా ఓ ప్రకటన చేసింది. 'బీసీసీఐ వైద్య బృందం, టీమ్ యాజమాన్యం మధ్య జరిగిన చర్చల అనంతరం 'వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్'లో భాగంగా సిరాజ్‌కు కొంతకాలం విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. సుదీర్ఘమైన అంతర్జాతీయ సీజన్‌కు ముందు అతను పూర్తిగా కోలుకునేలా చూసేందుకు, ముందుజాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నారు' అని బీసీసీఐ స్టేట్‌మెంట్‌లో పేర్కొంది. తాజాగా అఫ్ఘాన్‌తో ముగిసిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో సిరాజ్ ప్రదర్శన పేలవంగా ఉంది. ఈ టెస్టులో అతడు తొలి ఇన్నింగ్స్‌లో 9 ఓవర్లు బౌలింగ్ చేసినా వికెట్ దక్కలేదు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 1 వికెట్ పడగొట్టాడు. కాగా, రీసెంట్‌గా జరిగిన టీజీ 20 క్రికెట్ లీగ్ వేలంలో మహ్మద్ సిరాజ్ భారీ ధర దక్కించుకున్నాడు. అతడిని వేలంలో రూ.14 లక్షలకు వరంగల్ వారియర్స్ కొనుగోలు చేసింది. ఈ వేలంలో అతడిది మూడో అత్యధిక ధర కావడం విశేషం.

ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లకు భారత జట్టు :
శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, ప్రసిద్ధ్ కృష్ణ



# స్లమ్ డాగ్' పూరి జగన్నాథ్ గారి సినిమాలలో ఒక బెస్ట్ ఫిల్మ్ అవుతుంది

**టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో విజయ్ సేతుపతి**

**'స్లమ్ డాగ్' లో పవర్ ఫుల్, యూనిక్ విజయ్ సేతుపతిని చూస్తారు. జెన్జీ యూత్ ఈ సినిమాని ఫ్యామిలీతో కలసి చూడాలని కోరుతున్నాను: డైరెక్టర్ పూరి జగన్నాథ్**

**విజయ్ సేతుపతి, పూరీ జగన్నాథ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్-డ్రామా'స్లమ్ డాగ్' పవర్‌ఫుల్ టీజర్ లాంచ్**


డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్-డ్రామా 'స్లమ్ డాగ్' 33 టెంపుల్ రోడ్'. ఈ చిత్రంపై అన్ని భాషల ప్రేక్షకులలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ చివరి దశలో ఉంది; అన్ని భాషల వెర్షన్లకు సంబంధించిన పనులు వేగంగా సాగుతున్నాయి. ఆసక్తికరమైన టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్-లుక్ పోస్టర్‌ను ప్రకటించినప్పటి నుంచే ఈ చిత్రం మంచి బజ్ నెలకొంది. మ్ డాగ్' చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్, జె.బి. నారాయణరావు కొండ్రోల్లా జె.బి. మోషన్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మించారు. తాజాగా చిత్ర బృందం టీజర్‌ను లాంచ్ చేశారు "ఒక్క వాన పడితే కాకుల్లా చెట్ల కింద దాక్కునే జీవితాలు మావి. అలాంటి మా బతుకులతో ఆడుకుంటే నేనెందుకు వదులుతాను' అనే పవర్ ఫుల్ డైలాగ్ తో మొదలైన టీజర్ అదిరిపోయింది. యాక్షన్, ఎమోషన్, మిస్టరీ అంశాలతో కూడిన ఆసక్తికరమైన సన్నివేశాలు కట్టిపడేశాయి. సినిమాలోని ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూనే, విజయ్ సేతుపతి పాత్ర చుట్టూ ఉన్న మిస్టరీని ఆసక్తికరంగా వుంది. నిజంగా ఆయన పాత్ర గుడ్డివాడా? లేక దాని వెనుక మరేదైనా రహస్యం ఉందా? అనే ప్రశ్న ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతుంది. విభిన్నమైన పాత్రలు, తనదైన శైలిలో కథలను ఆవిష్కరించడంలో పేరుగాంచిన పూరి జగన్నాథ్, ఈసారి కూడా విజయ్ సేతుపతి కోసం ఒక ప్రత్యేకమైన పాత్రను సృష్టించారు. కథానాయకుడి చుట్టూ నడిచే మిస్టరీ ఈ టీజర్‌కు ప్రధాన బలంగా నిలిచి, కథపై మరింత క్యూరియాసిటీని పెంచింది. విజయ్ సేతుపతి దృష్టి లోపం ఉన్న బిచ్చగాడి పాత్రలో అద్భుతంగా ఒదిగి పోయారు.

అదే సమయంలో ఆ పాత్రలోని హీరోయిజాన్ని కూడా అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఆయన లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కథానాయికగా సంయుక్త నటిస్తుండగా, పోలీస్ అధికారిణి పాత్రలో టబు తనదైన ముద్ర వేశారు. విలన్ గా దునియా విజయ్ ఫెరోషియస్ గా కనిపించారు. అలాగే బ్రహ్మజీ, వీటీవీ గణేష్ పోషించిన పాత్రలు కూడా టీజర్‌లో కీలకంగా కనిపించాయి.

# రామ్‌చరణ్ నటన మైండ్ బ్లోయింగ్

## జగపతి బాబు పాత్ర అద్భుతంగా ఉంది పెద్దిపై బన్నీ ప్రశంసలు

వివాదాల నడుమ బాక్సాఫీస్ దగ్గర దూసుకుపోతున్న 'పెద్ది'పై ప్రశంసలు కూడా పెద్ద ఎత్తున విన్పిస్తున్నాయి. ఇలాంటి టైమ్ లో అల్లు అర్జున్ చేసిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో రచ్చ చేస్తోంది. సినిమా విడుదలై ప్రేక్షకుల నుంచి స్పందన వస్తున్న వేళ, స్వయంగా సినిమా చూసిన బుచ్చిబాబు సానాపై చేసిన ప్రశంసలు. ప్రతి పాత్రను ఎలివేట్ చేస్తూనే రామ్ చరణ్ పాత్రను మరింత ఎత్తుకు తీసుకెళ్లినందుకు దర్శకుడికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఒక హీరోని మాత్రమే కాకుండా మొత్తం కథలోని పాత్రలన్నింటినీ బలంగా నిలబెట్టడం దర్శకుడి విజయమని ఆయన సందేశం




బన్నీ తన అభిప్రాయాన్ని పంచుకోవడం ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. 'పెద్ది' చూసిన తర్వాత రామ్ చరణ్ నటన గురించి అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలు మెగా అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బన్నీ తన పోస్ట్ లో చరణ్ పర్ఫార్మెన్స్ మైండ్ బ్లోయింగ్ గా ఉందని చెప్పారు, అలాగే చెర్రీ పెద్ది పాత్రలో ఇంటెన్స్ గా, సహజంగా, అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్ఫర్మేషన్ తో ఆకట్టుకున్నాడని, డ్యాన్స్ లో కనిపించిన గ్రేస్ అన్నీ కలిసి ఒక పూర్తి స్థాయి నటుడిగా చరణ్ ను మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. ప్రతి అంశంలోనూ చరణ్ అద్భుతంగా రాణించాడని, ప్రస్తుతం అతడికి వస్తున్న ప్రశంసల్లో ప్రతి ఒక్కటి అతడు సంపాదించుకున్నవేనని చెప్పారు. తన సోదరుడి విజయాన్ని చూసి గర్వంగా ఉందని కూడా అల్లు అర్జున్ పేర్కొన్నారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన జగపతి బాబు గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన నటన బలంగా నిలిచిందని చెప్పారు. అలాగే జాన్వీ కపూర్ తో పాటు మిగతా నటీనటులందరికీ అభినందనలు తెలియజేశారు. తెరపై కనిపించే నటీనటులే కాదు, సినిమా కోసం కష్టపడిన టెక్నీషియన్స్, నిర్మాతలు కూడా ప్రశంసలకు అర్హులని చెప్పారు. అయితే అల్లు అర్జున్ పోస్ట్ లో మరో ముఖ్యమైన అంశం దర్శకుడు



ద్వారా స్పష్టమైంది. సాధారణంగా అభిమానుల మధ్య పోలికలు, ఫ్యాన్ వార్స్ ఎక్కువగా కన్పిస్తాయి. కానీ ఒక స్టార్ హీరో మరో స్టార్ హీరో పనితీరును ఇంత ఓపెన్ గా ప్రశంసించడం అరుదుగా జరుగుతుంది. అందుకే అల్లు అర్జున్ పోస్ట్ ఇప్పుడు వైరల్ గా మారింది.

## టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026" జ్యూరీ ఛైర్ పర్సన్ గా నటి ఇంద్రజ వ్యవహరిస్తారు

- టీఎఫ్ సీసీ ఛైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్
- ఈ అవార్డ్స్ ఔత్సాహికులకు గొప్ప అవకాశంగా నిలుస్తుంది - జ్యూరీ ఛైర్ పర్సన్ నటి ఇంద్రజ
- జ్యూరీ మెంబర్ గా సంగీత దర్శకుడు భోలే శావలి
- దాదాపు 30 కేటగిరీల్లో మొదటి 5 మంది విజేతలకు బహుమతులు
- మొదటి విజేతకు రూ.10 వేలు, రెండో విజేతకు రూ.7500, మూడో విజేతకు రూ.5 వేలు
- జూన్ 13వ తేదీ వరకు ఉచితంగా ఎంట్రీలను పంపే అవకాశం
- జూన్ 21న హైదరాబాద్ లో అవార్డ్స్ ప్రధానోత్సవం

చిత్ర పరిశ్రమలో న్యూ యంగ్ టాలెంట్ ను ప్రోత్సహించేందుకు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ టీఎఫ్



సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026 ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఫెస్టివల్ కు భారీగా ఎంట్రీలు వస్తున్నట్లు ఈ రోజు హైదరాబాద్ లో జరిగిన ప్రెస్ మీట్ లో డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలిపారు. ఈ అవార్డుల కమిటీ జ్యూరీకి ఛైర్ పర్సన్ గా నటి ఇంద్రజను ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. దాదాపు 30 కేటగిరీల్లో మొదటి ఐదుగురు విజేతలకు అవార్డ్స్ ఇస్తామని, మొదటి ముగ్గురు విజేతలకు అవార్డ్స్ తో పాటు నగదు బహుమతి కూడా అందిస్తామని డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ప్రకటించారు. కర్ణాటక, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల నుంచి కూడా తెలుగు వాళ్లు తమ షార్ట్ ఫిలింస్ పంపవచ్చని ఆయన అన్నారు

## విడుదలకు రెడీ అవుతున్న అఖిల్ లెనిన్

అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ 'లెనిన్'. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు మనం ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ ఊరమాస్ గ్రామీణ ప్రేమకథా చిత్రం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. టీజర్, సాంగ్స్ రిలీజ్ అయ్యాక ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ప్రీ-రిలీజ్ థియేట్రికల్ బిజినెస్ సర్కిల్స్‌లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బిజినెస్ క్లోజ్ అయినట్లు టాక్. రాయలసీమ మినహాయించి మిగిలిన ఆంధ్ర రీజియన్ థియేట్రికల్ హక్కులు దాదాపు రూ. 9 కోట్ల రేషియోలో క్లోజ్ అయింది. అఖిల్ గత చిత్రం ఏజెంట్ బిగ్గెస్ట్ డిజాస్టరా అయినా కూడా 'లెనిన్' స్టబెక్ట్ మరియు ప్రోమోస్ లోని మాస్ అప్పీల్ చూసి బయ్యర్లు ఈ స్థాయి మొత్తాన్ని పెట్టడానికి ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది.ఈ చిత్రంలో అఖిల్ సరికొత్త రఫ్ అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తుండగా, ఆయనకు జోడీగా క్రేజీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. థమన్ అందిస్తున్న మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. ఈ సినిమాతో అఖిల్ బాక్సాఫీస్ వద్ద సాలిడ్ కంబ్యాక్ ఇవ్వడం ఖాయమని అక్కినేని అభిమానులు నమ్మకంగా ఉన్నారు. ఆంధ్ర ఏరియాలోనే 9 కోట్ల రేషియోలో బిజినెస్ కదా రాయలసీమ మంచి రేట్ వచ్చే అవకాశం ఉంది. ఇక నైజాంలో అన్నపూర్ణ సొంత డిస్ట్రిబ్యూషన్ పైనే రిలీజ్ చేసే అవకాశం ఉంది.




# సినీ ప్రముఖుల చేతుల మీదుగా 'సిద్ధుగాడి లవ్ స్టోరీ' టీజర్, ట్రైలర్ లాంచ్

తెలుగు సిల్వర్ స్క్రీన్‌పైకి బ్యూటీఫుల్ యూత్ ఫుల్ లవ్ స్టోరీ రాబోతోంది. మోహన్ సిద్ధి, మహన్, శృతి శంకర్ హీరోహీరోయిన్లుగా, రమేష్ చెరుకూరు దర్శకత్వంలో, సావిత్రమ్మ నిర్మాణంలో, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ వి. సాంబశివ రావు మరియు వేణు గోపాల చారి సారధ్యం లో తెరకెక్కుతున్న చిత్రం 'సిద్ధుగాడి లవ్ స్టోరీ'. ప్రముఖ సినీ దర్శకులు, నిర్మాతలు, నటుల సమక్షంలో 'సిద్ధుగాడి లవ్ స్టోరీ' చిత్ర టీజర్, ట్రైలర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ప్రసాద్ ల్యాబ్‌లోజరిగిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ప్రముఖ దర్శకులు ఎ. కోదండరామిరెడ్డి, బి. గోపాల్, దామోదర ప్రసాద్, తెలుగు సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య, దర్శకులు వి. సముద్ర, రామ్ ప్రసాద్, నటుడు-నిర్మాత అశోక్ కుమార్, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, రాజేందర్ ప్రసాద్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, "పవన్ కళ్యాణ్ గారి డైలాగ్‌లో వచ్చిన 'సిద్ధు.. సిద్ధార్థ్ రాయ్' ఎంతగా ప్రేక్షకులకు కనెక్ట్ అయిందో, అదే విధంగా ఈ సినిమా కూడా ప్రేక్షకులకు బాగా చేరువ అవుతుందని నమ్ముతున్నాను. ఈ వేడుకలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ చిత్ర బృందానికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. డల్లాస్ నుంచి వచ్చి ఈ సినిమాను తెరకెక్కించిన దర్శకుడు రమేష్ గారు భవిష్యత్తులో మరెన్నో మంచి సినిమాలు నిర్మించాలని కోరుకుంటున్నాను" అన్నారు. తెలుగు సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ, "ఈ చిత్రాన్ని ఆశీర్వదించేందుకు వచ్చిన సినీ పెద్దలందరికీ ధన్యవాదాలు. రమేష్ గారు నన్ను సంప్రదించినప్పుడు ఆయనలో ఉన్న సినిమా పట్ల అభిరుచి, పట్టుదల నాకు అర్థమైంది. అందుకే ఆయనకు పూర్తి సహకారం అందించాను. మా దర్శకుల సంఘ సభ్యుల సినిమాల విడుదలకు సహకరించాలని మేము నిర్ణయించుకున్నాం. ఈ సినిమా చిత్ర బృందాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, నిర్మాతకు మంచి లాభాలు తీసుకురావాలని కోరుకుంటు



న్నాను" అన్నారు. ప్రముఖ నిర్మాత దామోదర ప్రసాద్ మాట్లాడుతూ, "గత పదేళ్లుగా ఎంతో మంది ఎన్‌ఆర్‌ఐలు సినీ పరిశ్రమలోకి వస్తున్నారు. అలాంటి వారిలో రమేష్ గారు కూడా ఒకరు. మంచి కథతో తీసిన ఈ చిత్రం విజయవంతం కావాలని కోరుకుంటున్నాను" అన్నారు. దర్శకుడు వి. సముద్ర మాట్లాడుతూ, "ఇలాంటి మంచి ప్రయత్నాలు తప్పకుండా ప్రేక్షకుల ఆదరణ పొందాలి. నిర్మాత ఇంకా ఎన్నో సినిమాలు నిర్మించాలని కోరుకుంటు న్నాను. ట్రైలర్ చాలా బాగుంది. సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అన్నారు. ప్రముఖ దర్శకుడు ఎ. కోదండరామిరెడ్డి మాట్లాడుతూ, "కొత్తవారితో మంచి కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం అభినందనీయం. టీజర్, ట్రైలర్ ఆసక్తికరంగా ఉన్నాయి. చిత్ర యూనిట్ అంతా ఎంతో కష్టపడి పని చేసినట్లు కనిపిస్తోంది. ఈ సినిమా ఘన విజయం సాధించాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. దర్శకుడు రమేష్ భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలు తెరకెక్కించాలని కోరుకుంటున్నాను" అన్నారు. ప్రముఖ దర్శకుడు బి. గోపాల్ మాట్లాడుతూ, "'సిద్ధుగాడి లవ్ స్టోరీ' ట్రైలర్ చాలా బాగుంది. ప్రేమకథకు వినోదం, భావోద్వేగాలు జోడించినట్లు కనిపిస్తోంది. చిత్ర యూనిట్ అందరికీ నా అభినందనలు. సినిమా మంచి విజయాన్ని సాధించి నిర్మాతకు, దర్శకుడికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను" అన్నారు.

## DJ టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ, రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ 'చిలక ప్రొడక్షన్స్ 'అనుమాన పక్షి' హిలేరియస్ ఫన్ రైడ్ టీజర్ రిలీజ్

'DJ టిల్లు'తో సంచలన విజయాన్ని అందుకున్న రచయిత-దర్శకుడు విమల్ కృష్ణ, మరో విభిన్నమైన వినోదాత్మక చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈసారి ఆయన 'చిలక ప్రొడక్షన్స్' బ్యానర్‌పై 'అనుమాన పక్షి' అనే యునిక్ కామెడీ చిత్రం కోసం యంగ్ హీరో రాగ్ మయూర్‌తో




జతకట్టారు. రాజీవ్ చిలక, రాజేష్ జగతియాని, హీరాచంద్ దండ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ కథానాయికగా నటిస్తున్నారు. రమణ గోగుల ఆలపించిన ఈ చిత్రంలోని మొదటి పాట 'గులాబ్ జామ్' ఇప్పటికే చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. తాజాగా చిత్ర బృందం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది. టీజర్‌లో రాగ్ మయూర్ పోషించిన పాత్రను పరిచయం చేశారు. తన చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరినీ, తన తల్లిదండ్రులను, ప్రేయసిని కూడా అనుమానించే స్వభావం ఉన్న యువకుడిగా కనిపించిన తీరు ఆకట్టుకుంది. అతని ఈ అనుమాన స్వభావం వల్ల వరుసగా జరిగే విచిత్రమైన, హాస్యభరితమైన, గందరగోళ సంఘటనలతో కథ ఆసక్తికరంగా ముందుకు సాగుతుంది. ఈ చిత్రం రెగ్యులర్ స్టోరీ ఫార్ములాలకు భిన్నంగా, వినూత్నమైన, ఆఫ్‌బీట్ నేరేషన్‌తో సాగుతుందనే టీజర్ తో స్పష్టమవుతుంది. ఫ్రెష్ నెస్, యూనిక్, అనూహ్యమైన మలుపులతో కూడిన కథన శైలి ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విమల్ కృష్ణకు ప్రత్యేకమైన వినూత్న కామెడీ శైలి ఈ టీజర్ అంతటా కనిపిస్తుంది. విభిన్నమైన పాత్రలు, నేచురల్ హ్యూమర్ తో మరోసారి గుర్తుండిపోయే వినోదాన్ని అందించబోతున్నట్లు టీజర్ చూస్తే అర్థమౌతుంది ఎప్పుడూ అనుమానపడే హీరో పాత్రలో రాగ్ మయూర్ అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతని హావభావాలు, స్క్రీన్ ప్రెజెన్స్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కథానాయికగా మెరిన్ ఫిలిప్ ఆకట్టుకోగా, ప్రిన్స్ సెసిల్, రాశి, అజయ్, అనన్య, చరిత్, బ్రహ్మాజీ, మస్త్ అలీ తమ తమ పాత్రల్లో అలరించారు. సాంకేతికంగా టీజర్ ఆకట్టుకుం టుంది. సినిమాటోగ్రాఫర్ సునీల్ కుమార్ నామా చిత్రానికి ప్రత్యేకమైన విజువల్ స్టైల్ అందించగా, శ్రీ చరణ్ పాకాల అందించిన నేపథ్య సంగీతం టీజర్‌లోని వినోదాన్ని మరింత పెంచింది. జేకే మూర్తి ప్రొడక్షన్ డిజైన్ సినిమా వర్క్ కి సరైన టచ్ ఇవ్వగా, ఎడిటర్ చోటా కె. ప్రసాద్ టీజర్‌ను షార్ప్ గా కట్ చేశారు. మొత్తంగా 'అనుమాన పక్షి' టీజర్ నవ్వులు పంచే వినోదభరిత ప్రయాణానికి ఆహ్వానం పలుకుతోంది. టీజర్ చూస్తుంటే ప్రేక్షకులకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అనిపిస్తోంది. ఈ చిత్రం జూలై 10న థియేటర్లలో విడుదల కానుంది

# కింగ్ నాగార్జున వందో మూవీ

## సైలెంట్‌గా షూటింగ్ పూర్తి చేస్తున్న చిత్ర బృందం

టాలీవుడ్ కింగ్ నాగార్జున నటిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 100వ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. 'కింగ్ 100', 'లాటరీ కింగ్' అనే వర్కింగ్ టైటిల్స్‌తో ప్రచారంలో ఉన్న ఈ మైల్‌స్టోన్ చిత్రానికి రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ సైలెంట్‌గా దూసుకుపోతోంది. అంతేకాదు.. షూటింగ్ దాదాపుగా చివరి దశకు చేరుకున్నట్టుగా టాక్. త్వరలోనే చిత్రీకరణ మొత్తాన్ని పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనుల పై ఫోకస్ చేసేందుకు చిత్ర యూనిట్ ఎ÷-లాన్ చేస్తోందట. మరోవైపు మ్యూజిక్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతోందట. వచ్చే నెలలోనే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసే ఆలోచనలో కూడా ఉన్నారట. అంతేకాదు.. అన్ని అనుకున్నట్టుగా జరిగితే ఈ ల్యాండ్‌మార్క్ మూవీని 2026 దసరా పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. కానీ, ఇప్పటి వరకు అఫీషియల్ అనౌన్స్మెంట్ మాత్రం రాలేదు. అసలు ఈ సినిమా టైటిల్ ఏంటి? నాగార్జున లుక్ ఎలా



ఉంటుంది? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు అభిమానులు. కానీ, కింగ్ ఈసారి అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ చిత్రంలో నాగార్జునకు జోడీగా సీనియర్ స్టార్ హీరోయిన్ టబు కీలక పాత్ర పోషిస్తుండగా.. యాక్షన్, డ్రామా, ఎమోషన్స్ కలిపి తెరకెక్కిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ టీజర్‌ను మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసే ఛాన్స్ ఉంది. మరి కింగ్ 100తో నాగార్జున ఎలా ఎ÷-లాన్ చేస్తున్నాడో చూడాలి.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380